

మచిలీపట్నం మండలం పెదపట్నం పంచాయతీలో ఇటీవల కాలంలో ప్రభుత్వ భూముల అక్రమణ, విక్రయాలు ఊపందుకున్నాయి. సముద్రతీరం వెంబడి ఉన్న ఈ గ్రామంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా, వాటిలో అధికశాతం భూములను అక్రమించే పరంపర కొనసాగుతోంది. పెదపట్నం, కానూరు గ్రామాల మధ్య ఉన్న మడ అడవులను సైతం నరికివేసి రొయ్యల చెరువులుగా తవ్వేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇటీవల కాలంలో పెదపట్నం పంచాయతీ శివారు గొల్లగూడెం సమీపంలో ప్రభుత్వ భూమికి తప్పుడు రికార్డులు సృష్టించి విక్రయాలు జరపడం గమనార్హం.

ఆక్రమణల పర్వం!

పెదపట్నంలో 4 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ.. ఆపై విక్రయం

ఆ భూమి పక్కనే మరో 4 ఎకరాలు ఆక్రమించిన కొనుగోలుదారుడు

- మొత్తం ఎనిమిది ఎకరాల్లో రొయ్యల సాగుకు చెరువుల తవ్వకం
- అడ్డుకున్న గ్రామస్తులు.. తహసీల్దార్‌కు ఫిర్యాదు
- స్థానిక రెవెన్యూ అధికారులపై అవినీతి ఆరోపణలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పెదపట్నం పంచాయతీ శివారున ఉన్న గొల్లగూడెం గ్రామం సముద్రం పక్కనే ఉంటుంది. ఈ గ్రామానికి, సముద్రానికి మధ్య ఉన్న ప్రభుత్వ భూమిని ఇటీవల గ్రామానికి చెందిన వ్యక్తి నాలుగు ఎకరాల వరకు బంటుమిల్లికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించాడు. ఈ భూమి సముద్రం పక్కనే ఉంది. ఈ భూమిని కొనుగోలు చేసిన సదరు వ్యక్తి పక్కనే ఖాళీగా ఉన్న మరో నాలుగు ఎకరాల భూమిని ఆక్రమించి రొయ్యల చెరువుగా తవ్వే పనులు ఇటీవల ప్రారంభించారు. ఈ విషయం గ్రహించిన గ్రామస్తులు పనులను నిలుపుదల చేయించారు. ప్రభుత్వ భూమిని ఎవరు విక్రయించారు.. ఎవరు కొనుగోలు చేశారనే అంశంపై గ్రామస్తులు ఆరా తీయడంతో అసలు విషయం బయటకు వచ్చింది.



గ్రామానికి ముప్పు పొంచి ఉందని ఆందోళన

అయితే కొనుగోలు చేసిన భూమితోపాటు దాని పక్కనే సముద్రానికి సమీపంలో ఉన్న నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి రొయ్యల చెరువులుగా మార్పు చేస్తుండటంతో కొందరు గ్రామస్తులు అడ్డు చెప్పారు. ప్రభుత్వ భూమిని ఇలా ఆక్రమిస్తూ పోతే, సముద్రంలో తుఫాన్లు సంభవించిన సమయంలో గ్రామానికి ముప్పు వాటిల్లుతుందనే కారణంతో ప్రభుత్వ భూమిలో రొయ్యల చెరువుల తవ్వకాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. కొందరు ఈ విషయం బయటకు రాకుండా చేసేందుకు ప్రయత్నాలు చేసినా అవి విఫలమయ్యాయి. ప్రభుత్వ భూమిలో రొయ్యల చెరువులు తవ్వడానికి ఒక వీఆర్వో, రెవెన్యూ అధికారులు తమ వంతుగా సహకరించారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఆక్రమణ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

కప్పిపుచ్చే ప్రయత్నం

పెదపట్నం గ్రామంలో వింత కట్టుబాటు ఉంది. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా, కొనుగోలు చేసినా విషయం బయటకు రాకుండా ఉంచాలని గతంలోనే గ్రామపెద్దలు తీర్మానం చేయడం గమనార్హం. ముంబైలో ముష్కరుల దాడి అనంతరం జాతీయ స్థాయిలో మెరైన్ పోలీస్ అకాడమీ నిర్మాణం కోసం 200 ఎకరాలకు పైగా భూమిని గొల్లగూడెం వద్ద గతంలో రెవెన్యూ అధికారులు కేటాయించారు. వివిధ కారణాలతో ఈ మెరైన్ అకాడమీ ఇక్కడ ఏర్పాటు చేయలేదు. ఈ భూములపై కన్నేసిన కొందరు కాలక్రమంలో వీటిని ఆక్రమించుకుని భీమవరానికి చెందిన బడాబాబులకు విక్రయించేస్తున్నారు. ఈ ఒరవడిలో భాగంగానే ప్రభుత్వ భూమికి తప్పుడు పత్రాలు పుట్టించి, కొంతకాలం తమ ఆధీనంలో ఈ భూములను ఉంచుకుని, వాటిని విక్రయించేయడం ఇక్కడ రివాజుగా మారింది. గతంలో చేసుకున్న తీర్మానం మేరకు ప్రస్తుతం ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం గ్రామంలోని కొందరు పెద్దలు చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించాం

పెదపట్నం శివారు గొల్లగూడెం వద్ద ప్రభుత్వ భూముల్లో రొయ్యల చెరువులు తవ్వే ప్రాంతాన్ని సోమవారం పరిశీలించాం. అక్కడ ఎలాంటి తవ్వకాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశాం. తవ్వకాలు చేపట్టకుండా రెవెన్యూ సిబ్బందితో నిఘా ఉంచాం.

-వి.నాగభూషణం, మచిలీపట్నం నార్త్ తహసీల్దార్

నున్నను కలపండి

జక్కంపూడి కారిడార్‌ను పరిగణనలోకి తీసుకోండి

- మెట్రో రైల్ ప్రతిపాదనలపై వెస్ట్, సెంట్రల్ ప్రజల వినతులు
- స్థానిక ఎమ్మెల్యేలకు విజ్ఞప్తులు చేస్తున్న కార్మికులు
- ఏపీఎంఆర్సీ ఎండీతో చర్చించాలని భావిస్తున్న ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెట్రో ప్రాజెక్టు మొదటి దశ పనుల్లో నున్న ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని జక్కంపూడి కారిడార్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు. నున్న, సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల నుంచి వివిధ పనులు, ఉద్యోగాల నిమిత్తం నగరంలోకి వచ్చేవారికి ఈ కారిడార్ అనువుగా ఉంటుందంటున్నారు. మెట్రో ప్రాజెక్టు మొదటి దశలో గన్నవరం నుంచి పీఎన్‌బీఎస్, పెనమలూరు సెంటర్ నుంచి పీఎన్‌బీఎస్‌కు రెండు కారిడార్లనే ఎంపిక చేశారు. విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో అత్యధిక సంఖ్యలో పేదలు నివసిస్తున్నారని, వీరిలో ఎక్కువగా కార్మికులే ఉంటారని, రోజూ వేలమంది నగరంలో ఉపాధి పొందటానికి, ఆటోనగర్‌లో పనిచేయటానికి వస్తుంటారని, ఇలాంటి సమయంలో జక్కంపూడి కారిడార్‌ను కొనసాగించాలనే డిమాండ్ వస్తోంది. ఈ మేరకు పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు వినతులు అధికంగా వస్తున్నాయి. విజయవాడ తూర్పు నియోజకవర్గంతో పోల్చుకుంటే పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో జనాభా ఎక్కువ. ఈ ప్రాంతాల్లో కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో ఉంటారు. కాగా, ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు కూడా త్వరలో ఏపీఎంఆర్సీ ఎండీ ఎన్వీ రామకృష్ణారెడ్డిని కలిసేందుకు సిద్ధమవుతున్నారు.

వినతులు స్వీకరించేనా..?

మొత్తం ఐదు కారిడార్‌లకు ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ప్రతిపాదించింది. తొలిదశలో గన్నవరం బస్‌స్టేషన్ నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా ఎయిర్ పోర్టుకు అనుసంధానమై, తిరిగి ఎన్‌హెచ్-16 నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు, ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌కు మొదటి కారిడార్‌ను ప్రతిపాదించింది. పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్‌కు వెళ్లేది రెండో కారిడార్. ఈ దశలో పీఎన్‌బీఎస్ నుంచి రాజధానిలోని లింగాయపాలెం వరకు, పీఎన్‌బీఎస్ నుంచి రైల్వేస్టేషన్‌ను అనుసంధానిస్తూ జక్కంపూడి వరకు రాక, పోక రెండు వేర్వేరు కారిడార్లకు ప్రతిపాదించింది. ప్రయాణికుల సామర్థ్యం ఎక్కువగా ఉంటుందన్న కారణంతో మొదటి దశకు ఆ ప్రాధాన్యమిచ్చామని మెట్రో వర్గాలు చెబుతున్నాయి. మరి ప్రజాప్రతినిధులు వినతుల మేరకు మెట్రో అధికారులు ఏం ఆలోచనలు చేస్తారో చూడాలి.

క్రీడా సంబరం

నేటి నుంచి ప్రజాప్రతినిధుల ఆటల పోటీలు

ప్రారంభించనున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- 20న పోటీల ముగింపు కార్యక్రమం
- పోటీల నిర్వహణకు 200 మంది సిబ్బంది నియామకం



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కోర్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాలకు సమయం ఆసన్నమైంది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఈ పోటీలు జరగబోతున్నాయి. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ పోటీలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే స్టేడియాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దారు. క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు ప్రత్యేకంగా ఒక పిచ్‌ను ఎర్రమట్టితో సిద్ధం చేశారు. అథ్లెటిక్స్, క్రికెట్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ క్రీడలను ఇందిగాంధీ మున్సిపల్ స్టేడియంలో, షటిల్ బ్యాడ్మింటన్‌ను డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఈ క్రీడల నిర్వహణకు రిఫరీలు, అంపైర్లు, సహాయకులుగా మొత్తం 200 మంది శాప్ సిబ్బందిని నియమించారు. మంగళవారం నుంచి గురువారం వరకు పోటీలు జరుగుతాయి.

13 క్రీడాంశాల్లో పోటీలు

మొత్తం 13 క్రీడాంశాల్లో ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు జరగబోతున్నాయి. క్రికెట్, పరుగు పందెం, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్,

మిగతా 6లో..

సీఎం 11 వర్సెస్ స్పీకర్ 11 జట్లు

క్రీడల్లో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ వేరు. ఈ క్రీడల్లో పాల్గొనడానికి మొత్తం 40 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ 40 మందిని నాలుగు జట్లుగా విభజించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే రెండు జట్లను ఖరారు చేశారు. సీఎం 11 వర్సెస్ స్పీకర్ 11 జట్లుగా వాటికి నామకరణం చేశారు. చివరి రోజున జరిగే మ్యాచ్‌లో సీఎం చంద్రబాబు పాల్గొనే అవకాశాలు ఉన్నాయని శాప్ వర్గాలు తెలిపాయి. మంత్రులు కింజరపు అచ్చన్నాయుడు, నారా లోకేశ్, వాసంశెట్టి సుభాష్, జిల్లా ఎమ్మెల్యేలు కొలికలపూడి శ్రీనివాస్, యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమారరాజా తదితరులు పేర్లను నమోదు చేసుకున్నారు.

హరిత బెర్మ్‌పార్క్ ముస్తాబు

మొత్తం 20 సూట్ రూమ్‌లు సిద్ధం

- 17 సూట్ రూమ్‌లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు
- మిగిలినవి సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్‌కు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆటల పోటీల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చేందుకు హరిత బెర్మ్‌పార్క్ ముస్తాబవుతోంది. మొత్తం 20 సూట్‌లను ఏపీటీడీసీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. వీటిలో 17 సూట్‌లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు కేటాయించారు. మరో మూడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి కేటాయించారు. బస వరకు ఏపీటీడీసీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజాప్రతినిధులందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు, సాయంత్రం స్నాక్స్ వంటివి ప్రభుత్వ స్థాయిలోనే కల్పించనున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో వారం రోజులుగా బెర్మ్‌పార్క్‌ను ముస్తాబు చేస్తున్నారు. ఈ పనులను ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సమీక్షిస్తున్నారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యకాండ

పెడనలో టీడీపీ నేతపై విచక్షణారహితంగా దాడి

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే అక్కడ మరోసారి దాడికి యత్నం

- పెడన వైసీపీ కౌన్సిలర్, అతని సోదరుడు, మరో 9 మందిపై కేసు నమోదు
- అరెస్టు చేసి కోర్టుకు తరలింపు.. 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయాధికారి
- మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి వద్ద పోలీస్ భద్రత ఏర్పాటు

సర్వజన ఆస్పత్రిలో సులేమాన్‌పై దాడి చేసేందుకు వచ్చిన వైసీపీ కార్యకర్తలు



మచిలీపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెడన నియోజకవర్గం వైసీపీ నాయకుల దౌర్జన్యకాండ శ్రుతిమించిపోయింది. టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు, దివ్యాంగుడైన సులేమాన్(దాదా)పై ఆదివారం రాత్రి పెడనలో వైసీపీ నాయకులు దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన అతన్ని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు ఆదివారం అర్ధరాత్రి 2గంటల సమయంలో ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న సులేమాన్‌పై మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది, అక్కడున్న వారు అడ్డుకున్నారు. వైసీపీ కార్యకర్తలు మరోసారి దాడికి వచ్చారని సమాచారం అందుకున్న టీడీపీ కార్యకర్తలు పెడననుంచి ఆస్పత్రికి తరలిరావడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆస్పత్రి అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపివేశారు. ఆస్పత్రి వద్ద ప్రత్యేక బలగాలతో

మిగతా 6లో..



బాధితుడు సులేమాన్‌ను పరామర్శిస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు

బాధితుడికి ఎమ్మెల్యే కాగిత పరామర్శ

మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు సులేమాన్‌ను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పెడన పురపాలక సంఘం మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పలువురు టీడీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాగితకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పెడనలో సులేమాన్‌పై దాడి చేసిన వైసీపీ నాయకులు ఆస్పత్రికి వచ్చి మళ్లీ అతనిపై దాడి చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. వైసీపీ మూకలు ఆస్పత్రిలో చేసిన గొడవకు సంబంధించిన సీసీ ఫుటేజీలను పోలీసులకు అందిస్తామని తెలిపారు. సులేమాన్‌కు, పెడనలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులకు టీడీపీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పేకాట శిబిరాలు నిర్వహించి కోట్లాది రూపాయల నగదు పోగేసుకున్న వైసీపీ కార్యకర్తలు ఈ దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. నిందితులపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పది పరీక్షలు ప్రారంభం

జిల్లాలో 98.81 శాతం హాజరు



మచిలీపట్నంలో గదుల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



గుడివాడలోని పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు, పోలీసులు

మచిలీపట్నం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 145 పరీక్షా కేంద్రాల్లో 21,072 మంది రెగ్యులర్ విద్యార్థులకు 20,822 మంది హాజరయ్యారు. హాజరు 98.81 శాతంగా నమోదైంది. 90 మంది ప్రైవేట్ విద్యార్థులకు 54 మంది హాజరయ్యారు. డీఈవో పి.వి.జె.రామారావు చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ కాన్సెప్ట్, నిర్మలా, భాష్యం హైస్కూళ్లలోని పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు పెడనలో రెండు పరీక్షా కేంద్రాలను, మరో అధికారి కృష్ణమోహన్ గన్నవరంలోని కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్పీ గంగాధరరావు చిలకలపూడి మునిసిపల్, నిర్మలా హైస్కూళ్ల వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

నేడు నాగాయలంకలో మాక్ డ్రిల్

- రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్

6లో

జిల్లా పూర్తిస్థాయి సమాచారం ఇవ్వండి

- అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

8లో

దేదీప్యమానం..

- త్వరలో భవానీ ద్వీపంలో.. లేజర్ షో, మ్యూజికల్ ఫౌంటేన్

6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-22 (మంగళవారం సాయంత్రం)

సహర్ : 04-53 (బుధవారం ఉదయం)

దేదీప్యమానం..

భవానీ ద్వీపంలో లేజర్ షో అండ్ మ్యూజికల్ ఫౌంటేన్ పునరుద్ధరణకు అడుగులు పడ్డాయి. ఇన్సూరెన్స్‌ను క్లెయిమ్ చేసుకోవటానికి అవకాశం కల్పించాలని, దెబ్బ తిన్న మెషినరీని పరిశీలించటానికి అనుమతులు ఇవ్వాల్సిందిగా పూర్వ నిర్వాహకుడు భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)కి లేఖ రాశాడు. దీంతో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న లేజర్ షో-మ్యూజికల్ ఫౌంటేన్ వెలుగు జిలుగులకు అడుగులు పడినట్టయింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



- త్వరలో భవానీ ద్వీపంలో.. లేజర్ షో, మ్యూజికల్ ఫౌంటేన్
- ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసేందుకు నిర్వాహకులు రెడీ
- రూ.12 కోట్ల వ్యయంతో గత టీడీపీ హయాంలో ఏర్పాటు
- కృష్ణా వరదలకు మెషినరీ మొత్తం డ్యామేజీ
- ఇన్సూరెన్స్ క్లెయిమ్ పట్టని వైసీపీ పాలకులు
- ఐదేళ్ల పాటు నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం
- కూటమి ప్రభుత్వంలో తిరిగి పునరుద్ధరణకు అడుగులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 12 కోట్ల వ్యయంతో భవానీ ద్వీపానికి అభిముఖంగా కృష్ణానదిపై లేజర్ షో అండ్ మ్యూజికల్ ఫౌంటెయిన్‌కు సంబంధించి మెషినరీని ఏర్పాటు చేశారు. భవానీ ద్వీపం నుంచి లేజర్‌షోను తిలకించేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా కృష్ణానదిపై ఏర్పాటు చేసిన మెషినరీ మొత్తం ధ్వంసమైంది. వాటికి ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ క్లెయిమ్ చేయించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడమే కాకుండా కృష్ణానదిలోని భవానీద్వీపంలో కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడతారా.. అంటూ అప్పటి పర్యాటకశాఖ మంత్రి అవంతి శ్రీనివాస రావు వాఖ్యానించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇలాంటి దీవులు ఉంటే వాటి రక్షణకు చర్యలు తీసుకుని పర్యాటకాభివృద్ధి చేపడతారు. దీవులతో పర్యాటకాభివృద్ధి చెందుతుందన్న విషయం నాటి మంత్రికి అవగాహన లేదన్న విమర్శలను సైతం లెక్కచేయక వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పర్యాటకాన్ని గాలికొదిలేశారు. ఐదేళ్లూ భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) అచేతనంగా ఉండిపోవడం.. తర్వాత కృష్ణానదికి వచ్చిన రికార్డు స్థాయి వరదల కారణంగా భవానీద్వీపం మరింతగా దెబ్బతింది.



వరదల విధ్వంసానికి పాడైపోయిన సామగ్రి



గత టీడీపీ హయాంలో లేజర్ షో వెలుగులు (ఫైల్)

కూటమి ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పర్యాటకంపై ఆశలు చిగురించాయి. భవానీ ద్వీపం పునరుద్ధరణ పనులు చేపట్టారు. బీబీటీసీ నేతృత్వంలో ద్వీపం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈడీగా పనిచేసిన సత్యనారాయణను ప్రభుత్వం తిరిగి నియమించింది. భవానీ ద్వీపం అభివృద్ధికి అడుగులు పడుతున్న తరుణంలో.. లేజర్ షో-మ్యూజికల్ ఫౌంటైన్ నిర్వాహకులు మూలన పడిన ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ముందుకు వచ్చారు. ధ్వంసమైన మెషినరీకి ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు కంపెనీ సానుకూలంగా ఉండటంతో ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించేందుకు మార్గం సుగమమైంది. కృష్ణానదిలో ఏర్పాటు చేసిన లేజర్ షో, మ్యూజికల్ ఫౌంటైన్ ఆసియాలోనే అతి పెద్దది. అభివృద్ధి చెందిన సింగపూర్, మలేషియాలలో కూడా ఇంత పెద్దది లేకపోవడం గమనార్హం. ప్రాజెక్టులో భాగంగా లేజర్ షోతో పాటు కృష్ణానదిలో నీటి తెరలను ఆవిష్కరిస్తే.. వెండితెర వెలుగులు విరజిమ్మినట్టుగా థీమ్ ప్రదర్శితమౌతుంది. కారుచీకట్లలో దేదీప్య వెలుగులు చూసేందుకు రెండు కళ్లు చాలవని పర్యాటక ప్రేమికులు అంటున్నారు. ఈ ప్రాజెక్టు కారణంగా భవానీ ద్వీపం కొత్త శోభను సంతరించుకోనుంది.



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

అర్జీల పరిష్కారంలో జిల్లాను అగ్రగామిగా నిలపండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అర్జీల పరిష్కారంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు నిబద్ధతతో కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు మొత్తం 133 అర్జీలు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారులు సంతృప్తిచెందేలా గడువులోగా పరిష్కరించాలన్నారు. డివిజన్, మండలస్థాయిలోనూ గ్రీవెన్స్‌డేను సమర్థవంతంగా నిర్వహించాలని, అర్జీల పరిష్కారంపై క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ఇందుకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.



సీవీఆర్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పది పరీక్షా కేంద్రాల తనిఖీ

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ జి.లక్ష్మీశ సందర్శించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సివిల్ కోర్టుల సమీపంలోని సీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు ఏర్పాట్లు పరిశీలించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. భద్రతతో పాటు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

పరిటాలలో మల్టీ కార్గో టెర్మినల్

- స్వాగతించిన ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సమీపంలోని పరిటాలలో మల్టీమోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ఏర్పాటును ఎంపీ కేశినేని శివనాథ్ స్వాగతించారు. అమరావతి రాజధానిని ప్రధాన నగరాలు, ఓడరేవులతో అనుసంధానించటం ద్వారా ఆర్థికవృద్ధిని సాధించటంలో అమరావతి రైల్వే లైను కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ కింద రైల్వేల ప్రగతిపై లోక్‌సభలో ఎంపీ ప్రస్తావించారు. ఎన్డీయే హయాంలో రైల్వే బడ్జెట్ కేటాయింపులు 2019-20లో 68వేల కోట్లు ఉంటే, 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రెండు లక్షల కోట్లు ఉండటం అభినందనీయమన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌ను అమరావతి రైల్వే లైన్‌ను ఆమోదించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ సమీపంలోని పరిటాలలో మల్టీ మోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ఏర్పాటు, అమరావతి రైల్వేలైన్‌ను ఆయన స్వాగతించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద గత మూడేళ్లుగా స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదని ఈ సందర్భంగా కేంద్రం దృష్టికి తెచ్చారు. విజయవాడ గుణదల-బెజవాడ క్రాసింగ్ వద్ద ఆరోఓబీ నిర్మాణానికి సర్వే ఇప్పటికే పూర్తయిందని, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌ను త్వరగా పరిష్కరించాలన్నారు.

రాష్ట్రపతి అల్పాహార విందుకు ఎంపీ శివనాథ్

వన్‌టౌన్ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చిన అల్పాహార విందు కార్యక్రమంలో సోమవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, స్పీకర్ ఓం బిర్లా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎంపీ జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, సహచర ఎంపీలతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. అల్పాహార విందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్నాటక, హర్యానా రాష్ట్రాలకు చెందిన ఎంపీలను రాష్ట్రపతి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీలను నియోజకవర్గ విశేషాలను రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారు.



ఎంపీలను పలకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మద్దతు ధరతో నష్టపోతున్నాం

- మార్కెటింగ్ అధికారుల ఎదుట అన్నదాతల ఆవేదన

కంచికచర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయిస్తే నష్టం తప్పితే మిగిలేదేమీ లేదు.. పంట కోతలు, నూర్పిళ్ల సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటం వల్ల మార్కెట్లో ధర నిలకడగా ఉండటం లేదు.. వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి అమ్ముకోవాల్సి వస్తుంది.. అని పలువురు రైతులు, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. వివిధ పంటలకు మార్కెట్లో లభిస్తున్న ధరలు, క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత సోమవారం సాయంత్రం కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చారు. యార్డు ఆవరణలో ఆరబోసిన మొక్కజొన్న, శనగలు, కందులను పరిశీలించారు. ఆయా పంటలకు అయ్యే పెట్టుబడి, లభిస్తున్న ధరల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాగంటి వెంకట్రావు, కొండేటి నారాయణ, దేవిరెడ్డి గోపాలరావు, మాగంటి రమేష్‌లు మాట్లాడుతూ, శనగ విత్తనాలు రాయితీ పోగా క్వింటా రూ. 7,030లకు కొన్నామని, మద్దతు ధర రూ. 5,650లు ఏవిధంగా గిట్టుబాటు అవుతుందని ప్రశ్నించారు. మొక్కజొన్న మద్దతు ధర రూ. 2,250లు ఉండగా, మార్కెట్లో రూ.2,150లకు కొంటున్నారని చెప్పారు. గతేడాది కందులను క్వింటా రూ. 11,900లకు విక్రయించగా, ప్రస్తుతం రూ. 6,500 నుంచి రూ. 7,000లోపు ధర ఉందన్నారు. పంట చేతికి వచ్చిన తర్వాత ధర పడిపోవటం సాధారణమైందని వాపోయారు. ఖరీఫ్‌లో పెసలు కొనకపోవటం వల్ల ఎక్కువ మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. శనగలకు రూ. 8వేలు, కందులకు రూ. 10పది వేల వంతున గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్, డీడీ లావణ్య, ఏడీ మంగమ్మ, మార్క్‌ఫెడ్ డీఎం మల్లిక, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. రైతుల సూచనలను మంత్రుల కమిటీకి నివేదించనున్నట్టు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత పేర్కొన్నారు.



కందులను పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత

స్టాల్ ఇన్ మాల్‌తో ఆర్థిక ప్రయోజనం

- నాబార్డు జీఎం కేవీఎస్ ప్రసాద్

కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో 'స్టాల్ ఇన్ మాల్స్' ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు నాబార్డ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో సోమవారం పీవీపీ మాల్‌లో నిర్వహించిన ప్రదర్శన, అమ్మకాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, నాబార్డ్ ద్వారా స్వయంసహాయక సంఘాల మహిళలు, యువతకు హస్తకళా ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. హస్తకళాకారులు అత్యంత నైపుణ్యంతో తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో స్టాల్ ఇన్ మాల్స్ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వినియోగదారుల అభిరుచుల మేరకు చేనేత, కలంకారీ వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండలు వంటివి ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, ఒడిసా, తెలంగాణా రాష్ట్రాల నుంచి స్వయం సహాయక బృందాల మహిళలు, నిరుద్యోగ యువత ప్రదర్శనలో పాల్గొన్నారని, వీరికి ఉచిత రవాణా, వసతి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. 'నేస్తం' సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ, గ్రామీణ హస్తకళారూపాలను తయారీ ధరలకే వినియోగదారులకు అందించడంతో అధికంగా అమ్మకాలు నిర్వహించి కళాకారులకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం జరిగిందన్నారు. అనంతరం హస్తకళాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, నేస్తం డైరక్టర్ కె.నందిని, పీవీపీ మాల్ అసిస్టెంట్ మేనేజర్ రాచేటి అనిల్‌కుమార్, నేస్తం సంస్థ ప్రతినిధులు, స్వయం సహాయక బృందాల మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న నాబార్డు జీఎం ప్రసాద్, నేస్తం సీఈవో సురేష్

వైభవంగా పసుపు కుంకుమల మహోత్సవం

పెనుగంచిప్రోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అనిగండ్లపాడు తిరుపతమ్మ అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమల మహోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు అనిగండ్లపాడులోని అమ్మవారి పుట్టింటి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ఇంటి కుటుంబ సభ్యులు పసుపు కుంకుమ, పట్టు వస్త్రాలు, పండ్లు, పూలు, గాజులను భక్తిశ్రద్ధలతో మేళతాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఎక్కించారు. వాహనాన్ని విద్యుత్ దీపాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి జయజయధ్వానాలు చెబుతూ స్వాగతం పలికారు. దేవస్థానం వద్దకు వాహనం చేరుకోగానే ఈవో కిషోర్‌కుమార్ ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, అధికారులు రాజగోపురం వద్ద ఘన స్వాగతం పలికి పుట్టింటి పసుపు కుంకుమలను ఆలయంలోకి తీసుకువెళ్లి అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు శ్రీరామ్ చిన్నబాబు, చింతల వెంకట సీతారామయ్య, పొందూరి సుధాకర్, అత్తునూరి అచ్యుతరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పుర ప్రముఖులు పాల్గొన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, గూడపాటి శ్రీనివాసరావు, గింజుపల్లి నరసయ్య, మాదల వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా విజయవాడ రూరల్ డీసీపీ మహేశ్వరరాజు స్వీయ పర్యవేక్షణలో ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం.ఎస్.కే అర్జునలు బందోబస్తు నిర్వహించారు.



పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

వైభవంగా చంద్రమ్మ పసుపు కుంకుమ ఉత్సవం

తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో నాలుగో రోజు సోమవారం తిరుపతమ్మ అమ్మవారి తోడి కోడలు చంద్రమ్మ అమ్మవారి పుట్టిళ్లు పెనుగంచిప్రోలులోని కన్నెటి వెంకట రమణ ఇంటి నుంచి అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో చంద్రమ్మ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యకాండ

(5వ పేజీ తరువాయి)

పికెట్‌ను ఏర్పాటు చేశారు.

11 మందిపై కేసు నమోదు

టీడీపీ నాయకుడు సులేమాన్‌పై దాడి చేసిన కేసులో పెడన పోలీసులు 11 మందిపై సోమవారం కేసు నమోదు చేశారు. శిరివేళ్ల రాజీవ్ గాంధీ, శిరివేళ్ల మహేష్, పెడన పురపాలక సంఘం 19వ వార్డు వైసీపీ కౌన్సిలర్ శిరివేళ్ల జయేష్, శిరివేళ్ల వెంకటప్రసాద్, శిరివేళ్ల శివప్రసాద్, పేరుబోయిన నాగబాబు, తుమ్మా పైడియ్య, పాము నాగరాజు, వాసం కొండలరావు, వాసం వెంకట్, పాము సాయిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ తర్వాత వీరిని స్థానిక కోర్టులో హాజరు పరిచగా, న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించారు. మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా పెడన పోలీస్ స్టేషన్‌లోనే ఉండి పరిస్థితిని సమీక్షించారు.

క్రీడా సంబరం

(5వ పేజీ తరువాయి)

టెన్నీకాయిట్, టెన్నిస్, వాలీబాల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ ఆటల్లో పోటీలు ఉంటాయి. మ్యూజికల్ చైర్స్‌లో కేవలం మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. టగ్ ఆఫ్ వార్‌ను రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. పురుషులకు, మహిళా ఎమ్మెల్యేలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొనడానికి ప్రజాప్రతినిధులు సోమవారంరాత్రి వరకు పేర్లను నమోదు చేసుకుంటూనే ఉన్నారు. మహిళా మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి షాట్‌పుట్‌లో పేర్లను నమోదు చేసుకున్నారు. పురుషుల షాట్‌పుట్‌లో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేరును నమోదు చేసుకున్నారు.

పరుగులు తీస్తాం..

మహిళల 100 మీటర్ల పరుగు పందెంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేరును నమోదు చేసుకున్నారు. అదే పురుషుల 100 మీటర్ల పరుగులో పార్వతీపురం ఎమ్మెల్యే విజయ చంద్ర, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఆధోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామగోపాలరెడ్డి, తూమాటి మాధవరావు, వంకా రవీంద్రనాథ్ పేర్లను నమోదు చేసుకున్నారు.

'గురి' తప్పదు..

క్యారమ్స్ పోటీల్లో పాల్గొనడానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేరు నమోదు చేయించుకున్నారు. అదేవిధంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కాయిన్స్‌ను గురి తప్పనివ్వబోమంటున్నారు. పురుషుల విభాగంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేరు రాయించుకున్నారు.



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాలు

సమ్మెను జయప్రదం చేయండి

- యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల పరిష్కారం కోసం మార్చి 24, 25 తేదీల్లో జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యుఎఫ్‌బియు) నేతలు పిలుపునిచ్చారు. యూనియన్ నేతలు సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీఈఎఫ్ఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆర్.అజయ్‌కుమార్, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ (అమరావతి సర్కిల్) డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీఎస్ఆర్ శేఖర్‌లు మాట్లాడుతూ, ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో ప్రధాన సమస్య అన్ని కేడర్లలో తగినంత నియామకాలు జరగాల్సి ఉందన్నారు. 5 రోజుల పనిదినాలను అమలు చేయాలని, టెంపరరీ, క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలు నిలువరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్‌సీబీఈ కౌన్సిల్ సభ్యుడు వీఎస్ఎఆర్ శ్రీధర్, ఏబీవోసీ నేత ఎండీ అజాం బాషా, ఏఐబీఓఏ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జె.అవినాష్, ఎన్‌ఓబీడబ్ల్యు ఉపాధ్యక్షుడు టి.రఘురామ్ పాల్గొన్నారు.



పూటీ లాగుతున్న ఎడ్లజత

ముగిసిన ఎడ్ల పోటీలు

గంపలగూడెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీనియర్ విభాగంలో పూటీ లాగుడు ఎడ్ల పోటీలు సోమవారంతో ముగిశాయి. 1.50 క్వింటాళ్ల ఎనిమిది నిమిషాల పోటీలో బాపట్ల జిల్లా కొత్తగుండ్ల పాలెం మండలం ఆవుల దొడ్డి గ్రామానికి చెందిన గోగినేని జ్ఞానసాయి దీపక్‌చౌదరి ఎడ్లజత ప్రథమస్థానం, చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామానికి చెందిన కొప్పు మహేశ్వర్‌రెడ్డి ఎడ్లజతకు ద్వితీయస్థానం, ముత్తాయిపాలెం గ్రామానికి చెందిన అంగిరేకుల మోహన్ మణికంఠ ఎడ్లజత తృతీయస్థానం సాధించగా.. వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన పి.మొగలాయి ఎడ్లజతకు నాలుగోవస్థానం, చీరాలకు చెందిన గుంజి హేమంత్ ఎడ్లజతకు ఐదో స్థానం లభించాయి. ఎడ్ల పోటీలను తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు ప్రారంభించారు.

నేడు నాగాయలంకలో మాక్‌డ్రిల్

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వరదల నిర్వహణపై కృష్ణా జిల్లా నాగాయలంకలో కృష్ణానది తీరంలోని శ్రీరామపాద క్షేత్రం వద్ద మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను చైతన్యపర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానికులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని ఆయన సూచించారు. మాక్‌డ్రిల్ నిర్వహణపై సోమవారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయం నుంచి కృష్ణాజిల్లా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. విపత్తు ముందు, తర్వాత జరిగే నష్టాన్ని తగ్గించుకునేందుకు ఈ మాక్ డ్రిల్ దోహదపడుతుందని ఆయన వివరించారు.



బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్, మృతుడు తమ్మిశెట్టి రవి(సర్కిల్)

బైక్‌ను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

- కొడుకు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు

జి.కొండూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ ట్యాంకర్ మోటార్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో కుమారుడు మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కట్టుబడిపాలెం సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన తమ్మిశెట్టి నరసింహారావు అతని పెద్ద కుమారుడు తమ్మిశెట్టి రవి కలిసి మోటార్ బైక్‌పై సోమవారం మైలవరం మండలం గణపవరం గ్రామంలోని ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నారు. వారు కట్టుబడిపాలెం సమీపంలోకి రాగానే ఆయిల్ ట్యాంకర్ సడెన్‌గా యూటర్న్ తీసుకొని ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. రవి మీదుగా ట్యాంకర్ టైర్లు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా రవి (42) మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

కార్మికులను విధులోకి తీసుకోవాలి

గన్నవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ముస్తాబాద రిలయన్స్ గోదాములో పనిచేసే కార్మికులను తొలగించటంతో గత నాలుగు రోజులుగా ధర్నా చేస్తున్నారు. సోమవారం సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి సమాచారం లేకుండా తొలగించటం దుర్మార్గమన్నారు. రాంబాబు, స్వరూపరాణి, నాగరాజు, రంగారెడ్డి, మానస తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రిలయన్స్ గోదాము కార్మికులు

కంకర..చిందర వందర!

- తూతూమంత్రంగా ఉయ్యూరు-మంటాడ రోడ్డు మరమ్మతులు
- ప్రమాదకరంగా గుంతల్లో పోసిన కంకర
- జారిపడి పలువురు ద్విచక్రవాహనదారులకు గాయాలు
- అధికారుల తీరుపై వాహనదారులు, స్థానికుల మండిపాటు



ఉయ్యూరు- మంటాడ మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు గుంతల్లో లేచిపోయిన కంకర

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న సామెతగా ఆర్అండ్‌బీ అధికారుల తీరు మారింది. గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు నిర్వహించమంటే కంకరేసి సరి పెట్టాశారు. దీంతో పలువురు గాయాలపాలవుతున్నారు.

ఉయ్యూరు- మంటాడ ఆర్అండ్‌బీ రోడ్డులో తూతూమంత్రంగా చేసిన మరమ్మతు పనులతో ద్విచక్రవాహనాలు నడిపేవారు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి మంటాడ శివాలయం వరకు అడుగడుగునా గుంతలతో ద్విచక్రవాహనాలు కూడా నడపలేని పరిస్థితులు దీర్ఘకాలంగా నెలకొన్నాయి. రోడ్డుపై గుంతలతో ప్రజల అవస్థలను పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈనేపథ్యంలో ఇటీవల గుంతల్లో అక్కడక్కడా కంకర పోసి వదిలివేశారు. దీంతో కంకర లేచి రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉండటంతో రాత్రివేళ ద్విచక్రవాహన చోదకులు రాళ్లపై నుంచి జారిపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. కంకరపైన తారుపోయకపోవడం వల్ల రాళ్ల చిందరవందరై పెద్దవాహనాలు వెళుతున్నప్పుడు టైర్లకిందనుంచి లేచి పక్కన వెళ్లేవారికి తగులుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జయదేవ్

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

ఉయ్యూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాల ఆవరణలో పచ్చదనం, పరి శుభ్రతతో పాటు మెరుగైన వైద్యసేవలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్య తనిచ్చి కలసి పనిచేద్దామని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ కమిటీ సభ్యులు, వైద్యులకు సూచించారు. వైద్యశాల ఆవరణలో సోమవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వైద్యశాలలో పరిశుభ్రత, కాన్పుల సంఖ్య పెరిగేలా చూడడం, తల్లులు, శిశువులకు మెరుగైన వైద్యం అందిచాలన్నారు. వైద్యశాల సూపరిం టెండెంట్ స్వాతి, ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

గ్రేడ్ 2 మునిసిపాలిటీగా హోదా పెంచాలి

ఉయ్యూరు కౌన్సిల్ తీర్మానం

ఉయ్యూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీని రెండవ శ్రేణి పురపాలక సంఘం (గ్రేడ్ 2 మునిసిపాలిటీ)గా హోదా పెంచాలని కోరుతూ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో రెండవ శ్రేణి పురపాలక సంఘంగా హోదా పెంచాలని తీర్మానించి ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపడానికి ఆమోదం తెలిపారు. 2011లో నగర పంచాయతీగా రూపాంతరం చెందిన ఉయ్యూరు పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తూ జనాభా ప్రాతిపదిక, పురపాలక ఆదాయ వనరుల దృష్ట్యా నగరపంచాయతీ నుంచి రెండవ శ్రేణి పురపాలక సంఘంగా హోదా పెంచాలని తీర్మానాన్ని కౌన్సిల్ ఆమో దం తెలిపింది. దీంతో పాటు అజెండాలో పొందుపరచిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి, 2025-2026 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కమిషనర్ పి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎంపీడీవో అనూషకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పని ఒత్తిడి తగ్గించండి

ఎంపీడీవోకు కార్యదర్శుల వినతి

కంకిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : టార్గెట్ పెట్టి పని చేయిస్తున్నారని, పని ఒత్తిడి తట్టుకోలేక పోతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఎంపీడీవో అనూషను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో కార్యదర్శులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల పరిధిలో అవసరానికి అనుగుణంగా శానిటేషన్ సిబ్బంది లేరన్నారు. సిబ్బంది లేకుండా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం ఎలా సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శులు బాబూజీ, చింతా కిరణ్‌కుమార్, సాంబశివరావు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చిన్నారుల ఆధార్ నమోదు

హనుమాన్‌జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 19 నుంచి 28 తేదీ వరకు మండలంలోని సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె జోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నేత గరికిపాటి మృతి

కంకిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దూరుకు చెందిన టీడీపీ నాయకుడు గరికిపాటి సుబ్బారావు (72) సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల మేరకు.. కొన్నేళ్లుగా మద్దూరు సెంటర్‌లో ఓ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం ఖర్చులు తీసుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో గోసాల వైపు నుంచి ఇసుక క్వారీకి వెళ్లేందుకు ట్రాక్టర్ అతివేగంగా వెళ్తుంది. పక్కన వెళ్తున్న సుబ్బారావు ఆ వేగానికి కంగారు పడ్డాడు. రోడ్డు పక్కకు పడ్డాడు. దీంతో గుండెపోటు రావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.



పోరంకిలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. ఉయ్యూరులో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్

బెంజిసర్కిల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంతి సహాయ నిధి నుంచి 64 మందికి మంజూరైన రూ. 35లక్షల 9వేల 786 విలువ చేసే చెక్కులను సోమవారం పోరంకిలోని టీడీపీ నియోజకవర్గం కార్యాలయంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజక వర్గంలో ఇప్పటి వరకు రూ. మూడు కోట్లు విలువజేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం కాలంలో ఒక్కరికి కూడా సీఎం సహాయ నిధినుంచి చెక్కులు పంపిణీ కాలేదని, 2014 నుంచి 19 మధ్య కాలంలో సుమారు రూ. 30కోట్లు విలువజేసే చెక్కులను నియోజక వర్గంలోని ప్రజలకు ఆస్పతి ఖర్చుల నిమిత్తం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యఖర్చులకు సహాయం చేస్తూ కూటమి ప్రభుత్వం పేదలకు కొండంత అండగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. అనారోగ్యంతో వైద్యం చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న 21 మందికి మంజూరైన రూ. 19.60 లక్షల చెక్కులను సోమవారం లబ్ధిదారులకు రాజేంద్రప్రసాద్ అందజేశారు. పార్టీ నాయకులు జంపన వీర శ్రీనివాస్, అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, సాయి, ప్రసాద్, నరసింహారావు, తేజ తదితరులు పాల్గొన్నారు.



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

ఎన్‌డీఆర్ఎఫ్‌లో సీఎస్ఎస్ఆర్ పోటీలు ప్రారంభం

గన్నవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలంలోని కొండపావులూరు సర్వే నెంబర్ 6 పరిధిలోని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో సీఎస్ఎస్ఆర్ పోటీలను సోమవారం ప్రారంభించారు. కూలిపోయిన నిర్మాణాల శోధన, రెస్క్యూ కార్యాకలాపాలపై పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిస్సా, చత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, కేరళలోని అగ్నిమాపక శాఖ నుంచి ఒక బృందం వచ్చాయి. యూపీ 8వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ పోటీల విజేతలకు రన్నర్‌కు రూ.లక్ష, విన్నర్‌కు రూ.50వేలు నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

ఉంగుటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరులో సర్వేనెం. 661/1 లో ఖాళీగా వున్న సుమారు రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో స్థానిక ఉప్పర (సగర) కులస్థుల శ్మశానవాటిక కోసం కొంత భూమిని కేటాయించాలంటూ ఆ కులానికి చెందిన పలువురు పెద్దలు సోమవారం మండల పరిషత్, రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కులపెద్ద, మాజీ సర్పంచ్ కర్నాటి వీర రాఘవులు మాట్లాడుతూ, ఊరిచివర ఏలూరు కాలువకు సమీపంలో సర్వేనెం.661/1లో ఖాళీగా వున్న సుమారు 4ఎకరాల ప్రభుత్వ భూమిలో తమకు ఒక ఎకరం భూమి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పర కులపెద్దలు పోట్రు ఏడుకొండలు, తల్లిబోయిన గోపాల్, జలసూత్రం మద్దిరామయ్య, తల్లిబోయిన వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, నాయకులు షేక్ నాగూర్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో జేఏకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దలు

అర్జీదారునికి వడ్డీతో చెల్లించాలి

జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు

మచిలీపట్నం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కొనుక్కున్న స్థలానికి ఏడేళ్ల క్రితం ఇచ్చిన చెక్కు క్రెడిట్ కానందున స్థలం యజమానికి వడ్డీతో సహా చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మి సోమవారం తీర్పు ఇచ్చారు. తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి. కంకిపాడు మండలం ఈడుపుగల్లుకు చెందిన కోనేరు సాత్విక్ వద్ద ఒకరు స్థలం కొనుక్కున్నారు. ఈ స్థలానికి గాను సప్తగిరి గ్రామీణ బ్యాంకు పేరిట కొనుగోలుదారులు రూ. 13 లక్షల 50వేలకు 2017 నవంబరు 6న చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు క్లియరెన్స్ కోసం వెళ్లి కనబడకుండాపోయింది. దీంతో గత ఏడేళ్లుగా తనకు రావాలసిన సొమ్ము కోసం కోనేరు సాత్విక్, అతని తండ్రి రమేష్‌లు సప్తగిరి గ్రామీణ బ్యాంకు చుట్టూ తిరిగి విసిగిపోయారు. ఆ తరువాత జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఫోరం బ్యాంకు వారి వాదనలు, సాత్విక్, రమేష్‌ల వాదనలు విన్న అనంతరం రూ. 13 లక్షల 50 వేలకు 9 శాతం వడ్డీతో సప్తగిరి గ్రామీణ బ్యాంకు చెల్లించాలని తీర్పు ఇచ్చారు. ఈ సొమ్ముతో పాటు మానసికంగా ఏడేళ్లపాటు ఇబ్బందులు పెట్టినందుకు రూ. లక్ష, బ్యాంకు ఖర్చులకు రూ. 10వేలు అదనంగా చెల్లించాలని తీర్పు ఇచ్చారు.



కంకిపాడులో పది పరీక్షలకు హాజరైన విద్యార్థులు

పది పరీక్షలు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ / రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. మొదటి నిర్వహించిన తెలుగు పరీక్షకు మండలంలోని ఆరు కేంద్రాల్లో 20మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈవో రాంబాలసింగ్ తెలిపారు. మండలంలో 834 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా మొదటి రోజు 811 మంది హాజరైనట్లు తెలిపారు. వేలేరు, బాపులపాడు పరీక్షా కేంద్రాలను ఎంఈవో రాంబాలాసింగ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. **ఉయ్యూరు :** ఉయ్యూరు, మండల పరిధిలో 7 పరీక్షా కేంద్రాల్లో కేటాయించిన 1364 మంది విద్యార్థులకు గాను 1346 మంది పరీక్షకు హాజరైనట్టు డీవైఈవో పద్మారాణి తెలిపారు. **కంకిపాడు :** మండలంలోని పలు పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారం భమ య్యాయి. మొత్తం 1466 మంది విద్యార్థులకు గాను 1465 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఒకరు గైర్హాజయినట్లు అధికారులు తెలిపారు. **గన్నవరం :** మండలంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమ య్యాయి. 1117 మంది విద్యార్థులకు 8 పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. 12 మంది గైర్హాజరయినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. **ఉంగుటూరు :** మండలంలో పది పరీక్షలకు మొత్తం 593మందికి గాను 567 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో-2 జె.సాంబశివరావు తెలిపారు.

పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన ఆర్డీవో

ఉయ్యూరు : ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో హేలా షారోన్ సోమవారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు, మౌలిక సదుపాయాలు, వైద్య శిబిరం పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న ప్రతి గదిని తనిఖీచేసి, కాపీయింగ్, మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఆర్డీవో వెంట ఉన్నారు.

తిరుపతమ్మ, గోపయ్యస్వామికి ప్రత్యేక పూజ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలని నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. వీరవల్లిలోని తిరుపతమ్మ, గోపయ్య స్వామి వారి మహోత్సవాల్లో భాగంగా ఆళ్ల దంపతులు సోమవారం ప్రత్యేక పూజలో పాల్గొని నూతన వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త నందమూరి మురళీకృష్ణప్రసాద్, మండాది రవీంద్ర, నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం

గన్నవరం : మండలంలోని దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం ఫాల్గుణ బహుళ తదియ దేవాలయం పునః ప్రతిష్ఠ 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి తెల్లవారు ఝామున తులసి దళాలతో సహస్రనామార్చన, పలు రకాల పుష్పమాలలతో విశేష అలంకరణ జరిపారు.



ఎమ్మెల్యే యార్లగడ్డను కలసి వినతిపత్రం అందజేస్తున్న నున్న రైతులు

బైపాస్‌ల అనుసంధానానికి కృషి

నున్న రైతులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామి

విజయవాడ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ బైపాస్, లోకల్ బైపాస్‌లను అనుసంధానించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నున్న గ్రామ రైతులకు హామీ ఇచ్చారు. విజయవాడ గురునానాక్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నున్న గ్రామ రైతులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నున్న గ్రామ అభివృద్ధికిగాను నేషనల్, లోకల్ బైపాస్‌లను అనుసంధానం చేయాలని రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామ సాయిబాబా గుడి రోడ్డుతో పాటుగా రూరల్ గ్రామాల రోడ్ల అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసిన వారిలో పంచాయితీ వార్డు సభ్యుడు గంపా శ్రీనివాస్, బూరుగుల చెరువ సాగునీటి సంఘం అధ్యక్షుడు ముళగుళ్ల సుబ్బారెడ్డి, రైతులు గుంటక సుబ్బారెడ్డి, గోపాలరెడ్డి తదితరులు ఉన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు

ముగిసిన హెల్త్ యూనివర్సిటీ క్రీడలు

గన్నవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు అన్నారు. వైద్య విద్యార్థులకు క్రీడలు దోహదపడతాయని చెప్పారు. ఎన్టీఆర్ సిద్ధార్థ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మండలంలోని చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఫేజ్-2 పురుషుల 26వ ఇంటర్ క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ ఇత్రిమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవినేని రవి తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల

మూడు రోజులుగా జరిగిన క్రీడాపోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జీఎస్ఎల్ మెడికల్ కళాశాల కైవసం చేసుకుంది. అతిథుల చేతుల మీదుగా ట్రోఫీలు, బహుమతులు, పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. బ్యాడ్మింటన్‌లో విన్నర్‌గా రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, రన్నర్‌గా ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాల, టేబుల్ టెన్నిస్‌లో విన్నర్‌గా శ్రీకాకుళం గ్రేట్ జీఈ మెడికల్ కళాశాల, రన్నర్‌గా అనంతపూర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల, టెన్నిస్‌లో విన్నర్‌గా గుంటూరు కాటూరి మెడికల్ కళాశాల, రన్నర్‌గా రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, ఫుట్‌బాల్‌లో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, నెల్లూరు ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల విద్యార్థులు రాణించారు.

కేబుళ్లతో కళావిహీనం

విద్యుత్ స్తంభాలకు చుట్టలుగా వేలాడుతున్న వైర్లు

ప్రమాదభరితంగా మారి మెడకు చుట్టుకుంటున్న వైనం

ప్రేక్షకపాత్ర పోషిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన






బెంజిసర్కిల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో గోడలకు అందమైన పెయింటింగ్స్ వేయిస్తూ సుందరంగా ఉండేలా తీర్చిదిద్దటం ఎంతో బాగుంది! నగర సందర్శనకు వచ్చేవారికివి చక్కటి ఆహ్లాదాన్ని పంచుతాయి. గోడలపై పెయింట్స్ అందంగా కనిపిస్తున్నా వీటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాల సంగతేంటి? వాటికి చుట్టలుగా ఉన్న కేబుల్స్ మాటేమిటి? ఈ కేబుల్ చుట్టలు స్తంభాలకు వేలాడుతూ చూసేందుకు కళావిహీనంగా ఉన్నాయి. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలంటే పెయింటింగ్స్ వేయించటం ఒక్కటే కాదు. ఇలా స్తంభాలపై కనిపిస్తున్న కేబుల్ చుట్టలను కూడా సంస్కరించాలి. పెయింటింగ్స్‌పై పెడుతున్న శ్రద్ధ నగరంలోని విద్యుత్ స్తంభాలపైనా పెట్టాలి. ఒక సుందరమైన నగరానికి, ప్రణాళికాబద్ధంగా ఉన్న నగరానికి ఇలాంటివి బాగోవు. ఇతర దేశాల్లోని చిన్న టౌన్లలో కూడా రోడ్లపై ఎక్కడా కేబుళ్లతో కూడిన విద్యుత్ స్తంభాలు కనిపించవు. దీంతో ఆయా ప్రాంతాలు ఎంతో అందంగా కనిపిస్తాయి. కానీ మన నగరంలో స్తంభాలపైనే కేబుళ్లుంటాయి. భూగర్భ కేబుళ్లు వేయాలంటే ఆర్థికభారం తప్పదు. కానీ, ఉన్న వాటినైనా చక్కగా ఉంచాలి కదా! టెలిఫోన్, ఇంటర్నెట్, ఎంఎస్‌వో ఆపరేటర్ల కేబుల్స్ అన్నీ చుట్టలుగా చుట్టి స్తంభాలకు తగిలించటంతో ఎంతో జుగుప్సాకరంగా ఉన్నాయి. నగరానికి వచ్చే సందర్శకులకు ఇవి ఎబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో రాజధాని అమరావతి పనులు కూడా మొదలవుతున్నాయి. అమరావతిని చూడాలంటే ముందుగా విజయవాడే రావాలి. ఆ సమయంలో ఇలాంటి దృశ్యాలు ఎంతమాత్రం బాగోవు. నగరంలో ఎన్‌హెచ్ - 16, ఎన్‌హెచ్ - 65, బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, 5వ నెంబర్ రోడ్డు ఇలా ఏ రోడ్డు చూసినా విద్యుత్ స్తంభాలకు కేబుల్ చుట్టలు కనిపిస్తున్నాయి. ఇక అంతర్గత రోడ్ల సంగతైతే చెప్పనక్కరలేదు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు నగర అందాలను మెరుగుపర్చేందుకు గోడలపై పేయింటింగ్స్‌తో పాటు అనేక రకాల బొమ్మలను వేయిస్తున్నారు. వీటితో నగరం అందాలు వికసిస్తాయనే భావన ఉన్నా దాన్ని చిత్తుచేసేలా ఈ కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లు వేలాడుతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులు, వీధుల్లోని కరెంట్ స్తంభాలనూ వదలకుండా కేబుల్‌వైర్లు చుడుతున్నారు. అలాగే రోడ్డుమధ్యలో పైభాగం మీదుగా కేబులు వైర్లు వేస్తున్నారు. దీంతో ప్రమాదాలతోపాటు అస్తవ్యస్తమైన వాతావరణం నెలకొంది. అనుకోకుండా విద్యుత్‌వైర్ల నుంచి కరెంట్ విద్యుత్ ఐరన్ స్తంభానికి అంటుకున్నా ప్రమాదమే. అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను అమలుచేస్తే ప్రమాదాల నివారణతోపాటు నగరం సుందరీకరణంగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించాలి.



పటమటలంక మెయిన్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు చుట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లు

తాడిగడప మునిసిపాలిటీ పేరు మార్పు

మచిలీపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ పేరును తాడిగడప మునిసిపాలిటీగా మార్పుచేస్తూ రాష్ట్ర కేబినెట్ సోమవారం తీర్మానం చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా తాడిగడప పంచాయతీని వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ పేరుతో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్‌చట్టం 1945 షెడ్యూలు 10, కాలం-2లోని 1వ నెంబరులో పేర్కొన్న సూచనల ఆధారంగా తాడిగడప మునిసిపాలిటీగా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

కత్తులతో యువకుల వీరంగం

వైన్ షాపులో ఘర్షణ.. బీర్ సీసాలతో దాడి!

విజయవాడ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ వైన్‌షాపు వద్ద సోమవారం యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది. మద్యం మత్తులో వారు బీర్‌సీసాలతో తలలు పగలగొట్టుకుని కత్తులతో వీరంగం సృష్టించారు. పంచాయతీ పరిధిలోని లచన్ వైన్‌షాపు అజిత్‌సింగ్‌నగర్ పైపులరోడ్డుకు సమీపంలో ఉంది. ఇక్కడ మద్యం అమ్మకాలతో పాటుగా అనుమతులు లేకుండా అనధికార పరిమిట్ రూమ్ నడుస్తుండడంతో సోమవారం స్థానిక శాంతినగర్‌కు చెందిన కొందరు యువకులు మద్యం సేవించేందుకు వచ్చారు. మొత్తం నలుగురు యువకులు వచ్చి వారిలో వారే ఘర్షణ పడ్డారు. ఫూటుగా మద్యం సేవించిన ఓ యువకుడు బీర్ సీసాలను వైన్‌షాపు గోడకు కొట్టడమే కాక స్వయంగా తలపై మోదుకున్నాడు. రక్తస్రావం అవుతున్నా సరే పట్టించుకోకుండా తనతో వచ్చిన మరో యువకుడితో వాగ్వాదానికి దిగాడు. ఇంతలో మరో యువకుడు తన ద్విచక్రవాహనం నుంచి కత్తిని తీసి అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో బెంబేలెత్తిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొంతసేపటికి కొత్తపేట పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వారు అక్కడి నుంచి పరారవగా ఘర్షణ పడిన యువకులు ఎవరనే విషయమై పోలీసులు ఆరాతీస్తున్నారు.

కబ్జా బాధితులకు దొరకని న్యాయం

● రాజకీయ ఒత్తిళ్లే కారణమని బాధితుల ఆరోపణ

పాయకాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కండ్రిక కాలనీ సమీపంలోని ప్రైవేట్ వెంచర్ స్థలాలుగా నమ్మి కార్పొరేషన్ స్థలాలు కొని మోసపోయిన బాధితులకు న్యాయం దొరకడం లేదు. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ స్థలంగా నమ్మించి మోసగించిన కబ్జాదారులు దర్జాగా బయట తిరుగుతుంటే వారిని నమ్మి లక్షలాది రూపాయలు మోసపోయిన బాధితులు పోలీసు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమను మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసి నెల రోజులైనా కేసు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా పూర్తిస్థాయి సమాచారం ఇవ్వండి

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 26న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలో వివిధ శాఖల ద్వారా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాల సమాచారాన్ని నిర్దేశించిన ఫార్మాట్‌లో ఇవ్వాలని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ పుహాల్‌లో జేసీ గీతాంజలి శర్మ, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన 145 అర్జీలు స్వీకరించారు. తొలుత ఆయన మాట్లాడుతూ సీఎం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు పూర్తిస్థాయిలో సమాచారం త్వరగా తయారుచేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 19,378 అర్జీలు రాగా, 2,397 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. సత్వరమే పరిష్కరించాలన్నారు. గడువుమీరిన అర్జీలు ఐదు ఉన్నాయని, అధికారులు పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. హైకోర్టు ఆదేశాలను కృత్తివెన్ను ఈవోపీఆర్డీ అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు శివప్రసాద్, హరిహరనాథ్, ఆర్ అండ్‌బీ ఈఈ లోకేశ్, వ్యవసాయశాఖ జేడీ మనోహరరావు, డీఎస్‌వో పార్వతి, డీఎంహెచ్‌వో శర్మిష్ఠ, డీపీవో అరుణ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు: జేసీ

జిల్లాలో మినుము, పెసర కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేయనున్నట్టు జేసీ గీతాంజలిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 మినుము, 8 పెసర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మినుము క్వింటాలుకు మద్దతు ధరగా రూ.7,400, పెసర క్వింటాలుకు రూ.8,682గా నిర్ణయించినట్టు చెప్పారు. రైతులు ముందుగా పంట వివరాలను రైతుసేవాకేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. తేమశాతం 12లోపు ఉండి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న మినుము, పెసరకు పూర్తిస్థాయి మద్దతుధరను అందించడం జరుగుతుందన్నారు.



చెత్తకుప్పల్లోని పాలిథిన్ కవర్లలోని ఆహార పదార్థాలు తింటున్న పశువులు

పారిశుధ్యం కనుమరుగు

● ఆవులకు ఆహారంగా పాలిథిన్ కవర్లు

మచిలీపట్నం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే నగరంలో కలెక్టర్ బాలాజీ, కమిషనర్ బాపిరాజు పర్యటిస్తున్నారని తెలిస్తే ఆరోజు ఆయా డివిజన్లలో పారిశుధ్యం బాగుంటుంది. మిగతా రోజుల్లో మాత్రం ఉదయం 9 గంటల వరకు చెత్త కుప్పలు ఉన్నచోటే ఉండిపోతున్నాయి. తీసుకువెళ్లేవారు లేకపోవడంతో పశువులు వ్యర్థ ఆహార పదార్థాలతో పాటు పాలిథిన్ కవర్లను కూడా తినేస్తున్నాయి. ఒకపక్క కలెక్టర్, కమిషనర్ పాలిథిన్ కవర్లు, క్యారీబ్యాగ్‌ల వల్ల వచ్చే అనర్థాలపై గొంతెత్తి చాటుతున్నా పెరగటమే తప్ప తరగటం లేదు. హోటళ్లలో క్యారీబ్యాగ్‌లు వాడవద్దని కమిషనర్ హెచ్చరికలు జారీ చేశారు. అయినా సరే ఒకరిద్దరు తప్ప మిగిలిన వ్యాపారులంతా క్యారీబ్యాగ్‌లు లేకుండా వ్యాపారం చేయటం లేదున. నగరంలో యథేచ్ఛగా తిరిగే పశువులు కిలోల కొద్దీ వ్యర్థ ఆహారంతో పాటు క్యారీ బ్యాగ్‌లను కూడా తింటున్నాయి. దీంతో కొన్ని పశువులకు పశుసంవర్ధక శాఖ సర్జన్లు ఆపరేషన్లు చేసి క్యారీబ్యాగ్‌లను బయటకు తీశారు. చూసేందుకు గర్భం దాల్చినట్టు కనిపిస్తున్నా వాటి కడుపునిండా క్యారీ బ్యాగ్‌లే. సమస్యను పరిష్కారానికి అధికారులు ముందుకు రావాలి. నగరంలో రోడ్లపై చెత్త కనబడుతున్నా శానిటరీ సెక్రటరీలు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినబడుతున్నాయి.

'యాదాద్రి మహోద్భవం - భక్తిరస ప్రధానం'



విజయవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న సురభి నాటక మహోత్సవంలో మూడో రోజు శ్రీ ఆవేటి మనోహర్ సురభి కళామందిరం బృందం ప్రదర్శించిన 'శ్రీ యాదాద్రి మహోద్భవమ్' నాటకం భక్తి, రస, అభినయంతో అలరించింది. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ స్థల పురాణాన్ని ఆధారంగా ఈ నాటకం రూపొందించబడింది. నారదుడితో ప్రారంభమైన కథ హిరణ్యకశిపుడి దురహంకారాన్ని, ప్రహ్లాదుని భక్తిని, నరసింహస్వామి అవతరణ ఘట్టాలను హృద్యంగా ఆవిష్కరించింది. నరసింహస్వామి రోషం, జ్వాలా నరసింహ స్వరూప భంగిమలు ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. పాత్రధారులు అద్భుతమైన అభినయంతో రంగస్థలాన్ని కదిలించారు సంగీత ఎం.నాగరాజు, కథ-దర్శకత్వం ఎస్.ఎ.రఘునాథ్ అందించగా, రంగస్థల నిర్వహణను ఆర్.కోదండరావు సమర్థంగా చేపట్టారు. ప్రేక్షకులు ఈ నాటకాన్ని ఆద్యంతం ఆసక్తిగా వీక్షించి, నటీనటుల ప్రతిభను హర్షధ్వానాలతో ప్రశంసించారు.

రూ.21 వేల కనీస వేతనాలు ఇవ్వకుంటే సమ్మె

● పంచాయతీ కార్మికుల డిమాండ్ ● విజయవాడలో ధర్నా

ధర్నాచౌక్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధమవుతామని గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తమకు బానిస చాకిరీ నుంచి విముక్తి కల్పించాలని, పోరాడి సాధించుకున్న జీవోలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోర్టు తీర్పును బేఖాతరు చేస్తున్న అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, టెండర్లు లేకుండా కార్మికులను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీకి దిగుతున్నాయని ధ్వజమెత్తారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, గౌరవాధ్యక్షులు డి.వెంకట్రామయ్య, కె.ఉమామహేశ్వరరావు ప్రసంగించారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న కార్మికులు



ఏపీ జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన విద్యాసాగర్‌ను అభినందిస్తున్న సభ్యులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పట్టించుకోవాలి

● లేదంటే ఏప్రిల్‌లో కార్యాచరణ ● ఏపీ జేఏసీ రాష్ట్ర నేతలు

● జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎ.విద్యాసాగర్ ఎన్నిక

గాంధీనగర్,. మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై దృష్టి సారించాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వానికి తొమ్మిది నెలలు సహకరించామని, ఇంకా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఏప్రిల్‌లో కార్యాచరణకు సిద్ధపడతామని పేర్కొన్నారు. 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని, పీఆర్సీ అమలయ్యేలోగా 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్‌లు తదితర పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల జేఏసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎ.విద్యాసాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శివారెడ్డి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను సీఎం చంద్రబాబు, సీఎస్ దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో తీర్మానించినట్టు చెప్పారు. జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ విద్యాసాగర్ మాట్లాడుతూ నేటి వరకు వేతన సవరణ కమిటీ చైర్మన్‌ను నియమించకపోవడం శోచనీయమన్నారు. గతంతో ఎన్నడు లేని విధంగా గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ. 29 వేల కోట్ల బకాయిలు పెట్టిందన్నారు. ప్రభుత్వం మారినా ఉద్యోగులకు రావాల్సిన బకాయిల చెల్లింపులు జరగలేదన్నారు. హెల్త్ కార్డులపై చికిత్స అందడం లేదన్నారు. కేవలం రూ. 700 కోట్ల జీపీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులు మాత్రమే ఈ ప్రభుత్వం చేసిందన్నారు. బకాయిల చెల్లింపుపై రోడ్డు మ్యాప్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ జనరల్ సెక్రటరీ కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న మూడు డీఏల్లో ఒక్క డీఏ కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల నుంచి ఉద్యోగ సంఘాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు జీవో 1 అమలు చేయాలి

● ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ

బస్టేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు సంబంధించి 2019లో జారీ అయిన జీవో 1ను కిందిస్థాయి అధికారులు అమలు చేసేలా ఉత్తర్వులివ్వాలని, అసోసియేషన్ల అభిప్రాయాలు తీసుకోవాలని, ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడు ఎస్‌కే జిలానీ బాషా, అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి సోమవారం ఈ మేరకు ఆర్టీసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. జీవో 1ను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని అన్నిచోట్ల కార్మికులు ఆందోళన చేస్తున్నారని, కొన్నిచోట్ల అసోసియేషన్ల ప్రమేయం లేకుండానే నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. దీనిపై అసోసియేషన్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయం తీసుకోవాలని కోరామన్నారు. 2019లో వచ్చిన జీవో నెం.1తో ఉద్యోగులు, కార్మికులు ఎంతో సంతోషించారని, కానీ 2020 జనవరి 1 నుంచి ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యాక 2019 జీవో 1కు సంబంధించి రాతపూర్వకమైన ఆదేశాలేమీ లేకుండానే అమలును నిలిపివేశారన్నారు. దీంతో వందలాది మంది ఉద్యోగ, కార్మికులు అక్రమ సస్పెన్షన్లకు ఇతరత్రా ఉద్యోగ ఇబ్బందులకు గురయ్యారని, ఇంక్రిమెంట్లకు కోత వేశారని, దీంతో ఉద్యోగులు వేసే కేసులు కూడా పెరిగాయని చెప్పారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి 2019 జీవో 1ను కచ్చితంగా అమలు చేసేలా ఉత్తర్వులివ్వాలని, కార్మిక వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక అంశాలున్న జీవో నెం.70లో కాండక్ట్ రెగ్యులేషన్స్‌పై సవరణలు చేయాలని కోరారు.

రాజమండ్రి - విశాఖపట్నం డెము రైలు పునరుద్ధరణ

రైల్వే స్టేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 67285 రాజమండ్రి - విశాఖపట్నం, 67286 విశాఖపట్నం - రాజమండ్రి డెము రైళ్లను సోమవారం (ఈనెల 17) నుంచి పునరుద్ధరించినట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించామని, తాజాగా పునరుద్ధరించామని, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.



కాలగమనం చిత్రం ట్రైలర్ రిలీజ్‌లో పాల్గొన్న చిత్ర యూనిట్

గ్రామీణ నేపథ్యంలో 'కాలగమనం'

● ట్రైలర్ రిలీజ్‌లో హీరో రాజా

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నేపథ్యంలో తీసిన కాలగమనం చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని కాలగమనం చిత్రం హీరో రాజా కోరారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం దర్శక, నిర్మాత బుర్రి సుధాకర్ నిర్మించిన కాలగమనం చిత్రం ట్రైలర్ రిలీజ్ అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. సినిమాకు సంబంధించిన ఒక పాటను ఆవిష్కరించగా చిత్ర హీరో రాజా, హీరోయిన్ లావణ్య రామారావు జంటగా స్టెప్స్‌వేసి అభిమానుల్ని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్ మాట్లాడుతూ కాలగమనం చిత్రాన్ని కుటుంబ సమేతంగా వీక్షించవచ్చని తెలిపారు. దర్శక, నిర్మాత బుర్రి సుధాకర్ మాట్లాడుతూ చిత్రంలో ప్రేమ, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయని, కుటుంబ సమేతంగా చిత్రాన్ని వీక్షించవచ్చని తెలిపారు. ఏప్రిల్ నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు వెల్లడించారు. చిత్ర యూనిట్‌తో పాటు ఏపీ ఫిలిం ఛాంబర్ మాజీ అధ్యక్షుడు మధుమోహన్, వేగ జువెలరీ అధినేత వనమా సుధాకర్, కాపా శ్రీనివాసరావు హాజరై చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



బీసీ ఐక్యవేదిక నగర కమిటీ సభ్యులను అభినందిస్తున్న సుమన్

బీసీల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

● సినీ నటుడు సుమన్

గవర్నర్‌పేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీసీలు శ్రమజీవులని, వారి సమస్యల పరిష్కారానికి బీసీ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ కోరారు. సోమవారం నగరానికి వచ్చిన సుమన్ సీతారామపురంలోని బీసీ ఐక్యవేదిక కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తొలి తెలుగు శాసనకర్త ఎరి (కల్) ముత్తరాజు ధనంజయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగర బీసీ ఐక్యవేదిక నూతన కమిటీని అభినందించారు. బీసీ ఐక్యవేదిక నగరాధ్యక్షుడు పీవీఎల్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటైన నగర నూతన కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. వేదిక అధ్యక్షుడు ఎన్‌వీ రావు, బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం హీరో సుమన్.. రాజు స్వగృహానికి వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు. ఏపీ ఎన్జీవోస్ జనరల్ సెక్రటరీ ఏ విద్యాసాగర్, ప్రొఫెసర్ వెలగా జోషి, పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుళ్లపల్లి నారాయణరావు, వివిధ సంఘాల నేతలు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న వెటర్నరీ విద్యార్థులు

వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి

● 43వ రోజుకు చేరిన నిరసనలు, మానవహారం

గన్నవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ విద్యార్థులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులకు కూడా స్టైఫండ్ ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సాయికుమార్ డిమాండ్ చేశారు. గన్నవరం డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని కోరుతూ చేస్తున్న ఆందోళనలు సోమవారానికి 43వ రోజుకు చేరాయి. కళాశాల నుంచి గన్నవరం ఎన్టీఆర్ సర్కిల్ సెంటర్ వరకూ వినూత్న పద్ధతిలో ర్యాలీగా వచ్చి మానవహారం చేపట్టారు. సేవ్ వెట్స్ పేరుతో శవయాత్ర నిర్వహించారు. భరతమాత వేషధారణలో మూతికి నల్లరిబ్బన్ కట్టుకుని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ వెటర్నరీ విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి స్టైఫండ్ పెంచాలన్నారు. లేకుంటే ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పునీత్, నరసింహా, విక్రాంత్, మృదుల, వైష్ణవి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్ 90, 97, 107
చికెన్ విత్ స్కిన్ 170
చికెన్ స్కిన్‌లెస్ 180
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

తోట్లవల్లూరులో సిలువ యాత్ర

తోట్లవల్లూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : శ్రమల దినాల సందర్భంగా తోట్లవల్లూరులో ఆర్సీఎం చర్చి భక్తులు సోమవారం సిలువ యాత్ర నిర్వహించారు. ఉయ్యూరు ప్రాంతీయ ఆర్సీఎం ఫాదర్ రెవ. ఎం వరప్రసాద్ ముఖ్యాతిథిగా హాజరై ప్రార్థనలు చేసి సిలువ యాత్రను ప్రారంభించారు. క్రైస్తవులు శ్రమల దినాలను పాటిస్తూ ఉపవాస దీక్షతో సిలువ యాత్రను గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట కొనసాగించారు. యాత్ర అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పెద్దలు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో సిలువయాత్రలో పాల్గొన్న భక్తులు

పామర్రులో పారిశుధ్యం అధ్వానం

● అంతర్గత రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు ● కుక్కలు,పందుల స్వైరవిహారం ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పామర్రు) : స్వచ్ఛభారత్ అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రచారం చేస్తుంటే గ్రామాల్లో మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తుంది. గ్రామ పంచాయతీ అధికారులు తమ విధులను నిర్లక్ష్యంగా నిర్వహించడంతో అపరిశుభ్రత విలయతాడవం చేస్తోంది. నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పంచాయతీలోని పలు వార్డుల్లో, ప్రధాన రహదారుల పక్కన , జాతీయ రహదారి, గ్రామ అంతర్గత కూడలిలో పెద్దఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోయి డపింగ్ యార్డులుగా మారాయి. పంచాయతీ పారిశుధ్య కార్మికులు 50మందికిపైగా ఉన్నప్పటికీ వారు ఎప్పుడు, ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో ప్రజలకు తెలియడం లేదు. వారిని సక్రమంగా వినియోగించుకోవడంలో శానిటరీ విభాగం విఫలమైంది. దీంతో 20 వార్డుల్లో చెత్త, చెదారాలు గుట్టలుగా పెరుకుపోయి అపరిశుభ్రత ప్రదేశాలుగా దర్శనమిస్తున్నాయి. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన చెత్తకుండీల వద్ద వ్యర్థాలపై


పాత రిజిస్టర్ కార్యాలయం రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం గుట్టలు


శివాలయం వెనుకబజారులో అస్తవ్యస్తంగా ఉన్న వ్యర్థాలు

పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మరోపక్క దోమలు విజృంభిస్తుండటంతో ఎక్కడ వ్యాధుల బారిన పడతామేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పలు వార్డుల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగక ప్రజలు పడుతున్న అవస్థలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య మెరుగుదలకు అవసరమైనతక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

స్థానిక యలమర్రు రోడ్డులో ఏఎన్ఎం పాఠశాల సమీపంలో గడచిన వారం రోజులనుంచి చెత్తకుండీలు నిండి డంపింగ్ యార్డు మాదిరిగా తయారైంది. ఆ కుండీలవద్ద సున్నంబ్లీచింగ్ చల్లించడం లేదు. ప్రధాన సెంటర్లో పరిశుభ్రత చేయించి గ్రామం అంతా సూపర్ అనేచందనంగా ఉన్నతాధికారులకు సెల్ఫీలు తీసి పెట్టడం సరికాదు.

తుమ్మల నానిచౌదరి

నడవాలంటే ముక్కుమూసుకోవాల్సిందే..

స్థానిక ఉర్దూపాఠశాల సమీపంలో భార్గవి ఆస్పత్రి జంక్షన్ వద్ద మసీదుకు వెళ్లేమార్గంలో చెత్తచెదరంతో నిండిపోయిన వ్యర్థాలు నుంచి కుక్కలు వాటిని చిందర వందర చేయడంతో ఆరోడ్డుపై నడవాలంటే ముక్కులుమూసుకుని వెళ్లాల్సి వస్తోంది.



లింగమనేని బుల్లబ్బాయి

తక్షణమే చర్యలు తీసుకుంటాం

పామర్రు పంచాయతీలో పారిశుధ్యలోపం తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకుంటాం. పేరుకుపోయిన చెత్తాచెదారాల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.



సుధాకర్ , శానిటరి అధికారి


అవగాహన కల్పిస్తున్న విశ్వ చైతన్య చందు

దంతాల సంరక్షణపై అవగాహన

తోట్లవల్లూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే కూల్‌డ్రింక్స్ తాగటం తగ్గించాలని, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలని విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ విశ్వ చైతన్య చందు అన్నారు. ఐలూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థి పండలనేని వెంకట్ చొరవతో విద్యార్థులకు దంతాల సంరక్షణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కాట్రగడ్డ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

మినుముకు గిట్టుబాటు ధర కల్పించాలి

పెదపారుపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మినుముకు రూ.9200 బోనస్ కలిపి గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరుతూ పెదపారుపూడి సచివాలయం వద్ద రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యాతిథిగా విచ్చేసిన కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.రంగారావు మాట్లాడుతూ ధాన్యం నూర్పిడులు 30 శాతం ఇంకా మిగిలిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.వి.శ్రీనివాసరావు పెదపారుపూడి రైతు నాయకులు గారపాటి వీరనాగ బాబురావు, ఎన్.రాజ్యం, పూసునూరి వెంకటేశ్వరరావు, ఎ.వెంకట కృష్ణారావు, పాలడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. వానపాము గ్రామ సచివాలయం వద్ద శ్రీదేవి, దాసు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

గుడివాడ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని డీఎల్‌డీవో సుజాత అన్నారు. సోమవారం రామన్నపూడిలో ఫేజ్-4 కింద పేదరిక నిర్మూలనపై క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. అక్కడ మహిళల స్థితిగతులు, వారి పిల్లలు పెరిగిన వాతావరణం, వారి ఆర్థికపరిస్థితులు, గృహంలో ఉన్న వస్తువులు తదితర అంశాలను పరిశీలించారు. మహిళలతో పేదరికం నుంచి అభివృద్ధి బాటలోకి నడవటానికి ప్రభుత్వం ఏ విధంగా ప్రోత్సహిస్తుందనేది మహిళలతో మాట్లాడి వివరించారు. ఎంపీడీవో విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ గుడివాడ మండలంలో పీ4 సర్వే జాగ్రత్తగా నిర్వహిస్తున్నామన్నారు.

మొల్లమాంబ రామాయణంలో స్త్రీ వ్యక్తిత్వానికి పెద్దపీట

గుడివాడ , మార్చి 17(ఆంధ్రజ్యోతి) : 16వ శతాబ్దంలో మహా కవయిత్రి మొల్లమాంబ రచించిన రామాయణం స్త్రీ వ్యక్తిత్వానికే పెద్దపీట వేసిందని విజయవాడ సిద్ధార్థ కళాశాల అధ్యాపకురాలు, ఉపన్యాస శిరోమణి గోవాడ శేషారత్నం పేర్కొన్నారు. స్థానిక సుందరయ్యభవన్‌లో భారతీ సమితి ఆధ్వర్యంలో సోమవారం మొల్ల సాహిత్యంపై సదస్సు నిర్వహించారు. సమితి అధ్యక్షులు ప్రసాద్, మాధవరావు, రాఘవాచారి, వెంకటేశ్వరరావు, చిరంజీవిరావు,సాహితీ వేత్తలు దీవెన, శకుంతల, పద్మాలత, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దు

పెదపారుపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి, గుర్విందగుంట, దూళ్లవానిగూడెం, మహేశ్వరపురం గ్రామ మహిళలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలకు వైన్ షాపులను కేటాయించింది. దానిలో కృష్ణాజిల్లాలోని పెదపారుపూడి మండలం కేఆర్ఎస్/జీకే/11 గెజిట్ గల షాపును కేటాయించారు. పెదపారుపూడిలో ఇప్పటికే ఒక వైన్ షాపు ఉంది. ఈ రెండో షాపును పెదపారుపూడిలోని బస్టాప్ ఎదురుగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పెదపారుపూడి, గుర్విందగుంట, దూళ్లవానిగూడెం, మహేశ్వరపురం గ్రామస్థులు, విద్యార్థులు నిత్యం ఆ బస్టాప్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాప్ వద్ద మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ వై రంగారావుకు సర్పంచ్ చప్పిడి సమీరా, గ్రామస్థులు పీకా సురేఖ, ఎన్.వెంకట రమణ, టి.సుజాత, చప్పిడి మల్లికాంబ, పీక పద్మ వినతిపత్రాన్ని అందజేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ చప్పిడి సమీరా

పూడికతీత పనులు ప్రారంభం

గుడివాడ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం మోటూరు, గుంటా కోడూరు ప్రధాన కాలువ పూడికతీత పనులను సోమవారం రైతులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు ప్రారంభించారు. ఇరిగేషన్ ఏఈ బేగ్ ఆధ్వర్యంలో పూడికతీత పనులు ప్రారంభించారు. 30 లక్షల పనులు చేయటం వల్ల గత పదేళ్లుగా పడుతున్న రైతుల కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మోటూరు నీటి సంఘం ప్రెసిడెంట్ చలమలశెట్టి ఉమామహేశ్వరి, నాన్న, వెంకటరమణ, అంగడాల వీర్రాజు తదితరులు మోటూరు, గుంటాకోడూరు తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని కార్యదర్శుల వినతి

కూచిపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్యదర్శులు వారం రోజులపాటు పని చేయాల్సి రావటం, సెలవు దినాలతోపాటు పండుగ రోజుల్లోనూ విధులు నిర్వహించటం వల్ల ఒత్తిడికి గురై అనారోగ్యాల పాలవుతున్నామని మొవ్వ మండల కార్యదర్శులు ఎండీవో జె.ఉమాదేవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉదయం 6 గంటల నుంచి చెత్త సేకరణ పనుల్లో దినచర్య ప్రారంభించి పలు రకాల సర్వేల్లో పాల్గొంటున్నారు. పన్నుల వసూళ్లు, రికార్డుల నిర్వహణ, ఉన్నతాధికారులు నిర్వహించే టెలికాన్ఫరెన్స్‌లు, ముఖాముఖి సమావేశాల్లో పాల్గొనటం తలకు మించిన భారంగా తయారయిందన్నారు.అధికారులు సైతం సెలవు దినాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల ఒత్తిడికి గురై బీపీ, షుగర్ వంటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. కనీసం కుటుంబ సభ్యులతో గడిపే సమయం సైతం లేకుండాపోయిందని తెలిపారు. కావున పని భారం తగ్గించి సెలవు దినాల్లో విశ్రాంతి తీసుకునే వెసులుబాటు కల్పించాల్సిందిగా వినతిపత్రంలో కోరారు. హనుమాన్ గౌడ్, ఎంఎస్ఎన్.మూర్తి, ప్రభుకుమార్, సందీప్ రెడ్డి, అమర్‌నాథ్, పుష్పనాథం ఎండీవోకు వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.


వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వ్యాయామంతోనే గుండె పదిలం : సీఈవో

గుడివాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : క్రమం తప్పకుండా తీసుకునే ఆహారం, తగిన వ్యాయామంతోనే గుండె పదిలంగా ఉంటుందని పెద్దేశ్వర హెల్త్ కేర్ సెంటర్ సీఈవో పల్లెం ఆకాష్ పేర్కొన్నారు. స్థానిక ఆంజనేయఫంక్షన్ హాల్‌లో బీహెచ్ఎంపీఏ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు అధ్యక్షతన గుండెకు సంబంధించిన ప్రథమ చికిత్సపై సోమవారం ఆర్ఎంపీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక, సైక్లింగ్, వ్యాయామాలతో పాటు తక్కువ నూనెలతో కూడిన ఆహారం గుండె పదిలానికి ఆస్కారమిస్తుందన్నారు. 60ఏళ్లు పైబడిన ఆర్ఎంపీ వైద్యులకు చిరు సత్కార కార్యక్రమం చేపట్టారు. సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పోలా సింహాచలం, వర్కింగ్ అధ్యక్షులు చంద్రశేఖర్, రమేష్‌బాబు, ఆర్ఎంపీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రన్నాయుడు, ఫణికుమార్, కోశాధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దేశ్వర హెల్త్ కేర్ సెంటర్ సీఈవో ఆకాష్

వీరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


గోపుర కలశాన్ని ప్రతిష్ఠకు తీసుకు వెళుతున్న నిర్వాహక కమిటీ సభ్యులు

గుడ్లవల్లేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మామిడికోళ్ల గ్రామంలో వేంచేసియున్న వీరమ్మ తల్లి నూతన ఆలయంలో అమ్మవారి , విఘ్నేశ్వర విగ్రహ ప్రతిష్ఠా , ఆలయాల గోపుర కలశాల ప్రతిష్ఠా, కుంభాభిషేకం వేడుకలు సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు ఓ వైపు, మామిడికోళ్ల వీరమ్మ తల్లికీ జై అంటూ భక్తుల జేజే ధ్వానాలు మరోవైపుతో మామిడికోళ్ల గ్రామం మార్మోగింది. విగ్రహాల పూజల అనంతరం వీరమ్మ తల్లి మూల విరాట్ అమ్మవారు, నూతన విగ్రహం, విఘ్నేశ్వరుని విగ్రహం, ఆలయ గోపుర కలశాలను వేద పండితులు అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గ్రామంలోని ఒక్కో వంశంవారు ఒక్కో ఆభరణాలు, చీరలు, కిరీటాలు, మకరతోరణం, మంగళసూత్రాలు, అమ్మవారికి సారె ఇలా అన్నిటినీ వారి వారి ఇళ్ల నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారికి వేదపండితులు వాటిని అలంకరించారు. అనంతరం తొలుత గోమాతను దర్శించిన పిదప కుంభం వారపోసిన అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం పూర్ణాహుతి, వేదపండితులకు సత్కారం, గ్రామోత్సవాలు నిర్వహించారు. గుడ్లవల్లేరు ఎస్సై వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షులు వల్లభనేని బాబూరావు, జంగం మోహనరావు, మరీదు నాగలక్ష్మి, రమాదేవి, వెనిగండ్ల రామకృష్ణ , డిసి చైర్మన్‌లు సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, వీరాంజనేయులు, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, జనసేన జిల్లాపార్టీ సెక్రటరీ పేర్ని జగన్, రవికుమార్, మురళి, రామరాజు, శశిభూషణ్, రవికుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేత్రదానం

గుడ్లవల్లేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో సోమవారం నేత్రదాన కార్యక్రమం నిర్వహించారు. గుడ్లవల్లేరుకు చెందిన మూల్పూరి శ్రీనివాస్ తల్లి వెంకటేశ్వరమ్మ ఆదివారం రాత్రి మృతి చెందింది. దీంతో వారి కుటుంబసభ్యుల అంగీకారంతో వెంకటేశ్వరమ్మ రెండు నేత్రాలను విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాల వైద్యులు సేకరించారు. తన కళ్లను దానంచేసి ఇద్దరికి చూపును ప్రసాదించిన ఆమెను,ఆమె కుటుంబాన్ని లయన్స్ సభ్యులు అభినందించారు. క్లబ్ అధ్యక్షులు నిమ్మగడ్డ శశికళ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా దేవస్థాన ఆవరణలో లోక కల్యాణార్థం సోమవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ హోమంలో 87మంది దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), ఉత్సవ కమిటీ సభ్యులు సాయన రాజేష్, లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, వి.పోతురాజు, వీరమాచనేని శైలజ, శలంకాయల లీలాకుమారి, ఎరుకపాటి సుశీల, వేదపండితులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రక్షణ చట్టం ప్రవేశపెట్టాలి

కూచిపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు రక్షణ చట్టం ప్రవేశపెట్టి అమల్జేయాలని కౌలు రైతులు ఆవిరిపూడి, నిడుమోలు, కాజ గ్రామ సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. మినుములకు 9 వేల రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కౌలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులను ఆదుకోవాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కౌలు రైతు సంఘ నేతలు, రైతులు శీలం నారాయణరావు, మద్దుల బసవయ్య, గుండాబత్తుల రమేష్, కిలారపు కనకదుర్గారావు, ఏనుగ వెంకటేశ్వరరావు, ఒంగూరు రమేష్, మేడిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు


మొవ్వలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు

గుడివాడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ఉరుకులు...పరుగులు....విద్యార్థుల్లో టెన్షన్.... పరీక్షా కేంద్రాల వద్ద కనిపించిన దృశ్యాలు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు గుడివాడ పట్టణ, రూరల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 2800మంది హాజరు కావల్సి ఉండగా, 15మంది గైర్హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్యసదుపాయం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు మండల విద్యాశాఖాధికారి బాలాజీ తెలిపారు.

కూచిపూడి: మొవ్వ మండలంలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. కాజ, కోసూరు, పెడసనగల్లు, మొవ్వ, కూచిపూడి, నిడుమోలు ఆరు కేంద్రాల ద్వారా 532 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పామర్రు : పామర్రులో పదోతరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంత వాతవారణంలో ప్రారంభమయ్యాయి. నిఘానేత్రల పర్యవేక్షణలో పూర్తి ప్రశాంత వాతవారణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మండలంలోని ఐదు సెంటర్లో కలిపి మెత్తం 739మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 735 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మొదటి రోజు పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో గుమ్మడి పద్మవాణి తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్యసిబ్బందిని నియమించామన్నారు. నల్లకుంట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సుల ద్వారా తరలించారు. పరీక్ష కేంద్రాల వద్ద కొనసాగుతున్న బందోబస్తును ఎస్సై రాజేంద్రప్రసాద్ పర్యవేక్షించారు. కస్టోడియన్‌గా ఎస్.పద్మజ, పి.సత్యనారాయణలు వ్యవహరించారు.


గుడివాడలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


పామర్రు జెడ్పీ హైస్కూల్లో తమ హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు, పెనమకూరు జెడ్పీ హైస్కూళ్లలో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తోట్లవల్లూరు కేంద్రంలో 103 మంది విద్యార్థులకు 102 మంది హాజరయ్యారు. పెనమకూరు కేంద్రంలో 76 మందికి 76 మంది హాజరయ్యారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో తొలిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ హైస్కూల్, కౌతవరం జిల్లాపరిషత్ హైస్కూల్, డోకిపర్రు జిల్లాపరిషత్ హైస్కూల్, అంగలూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లలో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాల్లో 8 హైస్కూళ్లకు చెందిన 502 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 501 మంది హాజరయ్యారు. కేవలం ఒక్కరు మాత్రమే గైర్హాజరయ్యారని గుడ్లవల్లేరు ఎంఈవో జగన్మోహనరావు తెలిపారు.

పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తాడంకి, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, మేడూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ల్లో 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా, 1364మంది విద్యార్థులకు 1346 మంది మాత్రమే తొలిరోజు పరీక్షకు హాజరుకాగా 18 మంది గైర్హాజరైనట్టు డీవైఈవో పద్మారాణి తెలిపారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 425



మాక్ డ్రిల్‌ను విజయవంతం చేయండి

నాగాయలంక, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామాల్లో వరదలు, తుపాన్లు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు ప్రాణాలు, ఆస్తులను ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించేందుకు ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పుష్కరఘాట్‌లో మాక్‌డ్రిల్‌ను విజయవంతం చేయాలని, అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని జిల్లా అధికారులు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, వెలుగు పీడీ పి.సాయిబాబు, తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీవో సుధాప్రవీణ్, ఎస్సై కె.రాజేష్, ఈవోపీఆర్డీ అప్పలనరసమ్మ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ఫీల్డ్ సిబ్బంది

కనీస వేతనం అమలు చేయాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తాము డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పదిహేడేళ్లుగా చేస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణించి, కనీస వేతనం ఇవ్వాలని కలెక్టరేట్ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం ధర్నా చేశారు. వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు మృతిచెందితే వారి కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, రిటైరయిన వారికి రూ.10 లక్షల బెనిఫిట్లు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సర్వీసు వెయిటేజీలు ఇవ్వాలని కోరారు. ఫీల్డు సిబ్బందికి పదోన్నతులు కల్పించి న్యాయం చేకూర్చాలన్నారు. ఏపీ ఆరోగ్యమిత్ర, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా తిరుగుతున్నాం..పెన్షన్ ఇప్పించండి



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వృద్ధులు

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలంటూ కలెక్టర్ కార్యాలయం చుట్టూ మూడేళ్లుగా తిరుగుతున్నామని, పింఛన్ మంజూరు చేయాలంటూ తురకపాలేనికి చెందిన యార్లగడ్డ మస్తాన్, ఆయన భార్య యార్లగడ్డ సక్కుబాయమ్మ కలెక్టర్ బాలాజీని వేడుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 70 ఏళ్లు పైబడినా నడుం వంగిపోయి నడవలేని స్థితిలో ఉన్నా తమకు పింఛన్ ఇవ్వడం లేదని వృద్ధ దంపతులు కన్నీరు కార్చారు. వంట చేసుకోవడమే కష్టంగా ఉందని, నడవలేని తమను తమ మేనకోడలు పద్మావతి ఇక్కడకు తీసుకొచ్చిందని తెలిపారు.

మా భూములు అన్యాక్రాంతం కాకుండా చూడండి

● కలెక్టర్ డీకే బాలాజీకి నడకుదురు దేవాలయ అర్చకుల వినతి

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తమ భూములను కౌలుదారులు అనుభవిస్తూ, తమకు కాకుండా చేస్తున్నారని వారి నుంచి భూములను పరిరక్షించాలని నడకుదురు దేవాలయానికి చెందిన అర్చకుడు కంతంరాజు సాయిశర్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తమ భూముల సమస్యలను కలెక్టర్ బాలాజీకి వారు వివరించారు. తమ సమస్యను దేవదాయశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న తమ భూములను కౌలుదారులు అన్యాక్రాంతం చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి



పెడనలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

పెడన, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చేనేత సమస్యలు పరిష్కరించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వాలు చేనేతను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. బడ్జెట్‌లో చేనేతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. చేనేత సమస్యలు పరిష్కరించకపోతే భారీగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు కట్టా హేమసుందరరావు, పేరిశెట్టి ఉమాకాంతం, బూసం బాలసుబ్రహ్మణ్యం, బళ్ల మల్లికార్జునరావు, కుర్మా విఘ్నేశ్వరరావు, పిచ్చుక సోమేశ్వరరావు ఆందోళనలో పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్..ఒకరి దుర్మరణం

● మరొకరికి తీవ్ర గాయాలు

కృత్తివెన్ను, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం లక్ష్మీపురం లాకు సెంటర్ వద్ద 216 జాతీయ రహదారిపై జరిగింది. ఎస్సై పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా నాగిడిపాలెం గ్రామానికి చెందిన వల్లభుని రాధాకృష్ణ(57), బర్రె నర్సింహస్వామి(37) స్వగ్రామం నుంచి పెదపుట్లపూడి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. లక్ష్మీపురం వద్ద బంటుమిల్లి నుంచి నర్సాపురం వెళ్తున్న లారీ..బైక్‌ను ఢీకొంది. రాధాకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింహస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. నర్సింహస్వామిని 108లో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాధాకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాధాకృష్ణ భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పోలవరం యూపీ పాఠశాలను

హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయండి

గూడూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పోలవరం గ్రామంలో ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ సోమవారం డీఈవో పీవీజే రామారావుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి హైస్కూల్‌గా మార్చాలని కోరారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

అవనిగడ్డ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. సోమవారం అవనిగడ్డలో చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ వారి సహకారంతో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మహిళలు నియోజకవర్గంలోని తీరంలో సమృద్ధిగా లభించే మత్స్య ఉత్పత్తులను ప్రాసెస్ చేసి వాటికి అదనపు విలువలు జోడించి లాభాలు పొందాలని ఆమె సూచించారు. శాస్త్రవేత్తలు జె.యశ్వంత్‌కుమార్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బందరు మండలం కరగ్రహారంలోని బాబా ఫరీద్ మస్తాన్ అవులియా దర్గా వద్ద 58వ ఉరుసు మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున శుద్ధిస్నానం జరిపారు. భక్తులు భజనలు చేస్తూ నగరంలో ఊరేగింపు జరిపారు. ఉరుసు చందల్ జెండాను గుర్రానికి తగిలించి ఊరేగించారు. సూరపనేని ఝాన్సీలక్ష్మి, పరసా వడ్డికాసులు, నడకుదిటి వెంకటేశ్వరరావు, అయోధ్యరామయ్య, మట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు.



మచిలీపట్నం బాలాజీ విద్యాలయంలో పరీక్ష రాయడానికి వెళుతున్న విద్యార్థులు



చిలకలపూడిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు





నాగాయలంక, ఘంటసాలలో పరీక్షలు రాసేందుకు కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



అవనిగడ్డలో పరీక్ష రాయడానికి బస్సులో వెళుతున్న పులిగడ్డ గురుకుల విద్యాలయం విద్యార్థులు

సజావుగా తొలి పరీక్ష

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం ● కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు

పెడన/గూడూరు/అవనిగడ్డ/చల్లపల్లి/ఘంటసాల/మోపిదేవి/కోడూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో తొలి లాంగ్వేజ్ పరీక్ష సోమవారం సజావుగా జరిగింది. పెడనలోని ఐదు పరీక్షా కేంద్రాలలో 574 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 564 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారు. నాలుగు పరీక్షా కేంద్రాలను డీవైఈవో పద్మారాణి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంఈవో-2 వైవీ హరనాథ్ పరిశీలించారు. గూడూరు మండలంలో 407 మందికి 396 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. అవనిగడ్డ మండలంలో 559 మంది విద్యార్థులు నాలుగు కేంద్రాల్లో పరీక్షలు రాయాల్సి ఉండగా, మొదటి రోజు నలుగురు గైర్హాజరయ్యారని, 555 మంది పరీక్షలు రాశారని ఎంఈవో ఎస్.శివశంకరరావు తెలిపారు. చల్లపల్లి మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. 783 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 780 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. ఎంఈవో పి.వెంకటేశ్వరరావు పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహించారు. బి.శ్రీరంగవల్లి, వేణుగోపాల్, శర్మ, రమణలు చీఫ్ సూపరింటెండెట్లుగా వ్యవహరించారు. గుడివాడ డీవైఈవో రవికుమార్ ఫ్లయింగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఘంటసాల హైస్కూల్‌లో 87 మందికి 86, కొడాలి హైస్కూల్‌లో 46 మందికి 46 మంది, శ్రీకాకుళం హైస్కూల్‌లో 77 మందికి 75 మంది హాజరయ్యారని విద్యాశాఖాధికారులు తెలిపారు. మోపిదేవి మండలంలో మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర గురుకుల పాఠశాల, పెదకళ్లేపల్లి జడ్పీ పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. 325 మంది హాజరు కావాల్సి ఉండగా, 324 మంది హాజరయ్యారు. ఎస్ఐ వై.వి.సత్యనారాయణ పరీక్షా కేంద్రాలను సందర్శించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. కోడూరు మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు చెందిన 330 మందికి 321 మంది హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో టి.వి.ఎం.రామదాసు తెలిపారు.

తొలి రోజే 52 మంది గైర్హాజరు

నాగాయలంక మండలంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 399 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, తొలి రోజునే 52 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు అధికారులు తెలిపారు.

యూనిఫాం వేసుకొచ్చారు..
పరీక్షకు అనుమతించం

● లింగారెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులతో చీఫ్ సూపరింటెండెంట్
● మార్చుకొచ్చే సమయం లేదు..అనుమతించమని కోరిన విద్యార్థులు



చీఫ్ సూపరింటెండెంట్ బ్రహ్మయ్యతో మాట్లాడుతున్న లింగారెడ్డిపాలెం ఉపాధ్యాయుడు

కోడూరు: పదో తరగతి పరీక్షలకు యూనిఫాం వేసుకొచ్చిన విద్యార్థులను అనుమతించబోమని చీఫ్ సూపరింటెండెంట్ బ్రహ్మయ్య తెలపడంతో కోడూరు శివారు స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో స్వల్ప వివాదం ఏర్పడింది. లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు యూనిఫామ్‌తో పరీక్షా కేంద్రానికి వచ్చారు. వారిని చీఫ్ సూపరింటెండెంట్ బ్రహ్మయ్య అనుమతించబోమన్నారు. విద్యార్థుల తోపాటు వచ్చిన లింగారెడ్డిపాలెం పాఠశాల ఉపాధ్యాయులు యూనిఫామ్ వేసుకుని పరీక్షకు రావొద్దని, ప్రభుత్వం జీవో విడుదల చేస్తే అది చూపించాలని సూపరింటెండెంట్‌తో వాదోపవాదాలు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని యూనిఫామ్‌కు అనుమతి లేదని సూపరింటెండెంట్ తెలిపారు. ఇంటికెళ్లి యూనిఫాం మార్చుకుని వచ్చే సమయం లేనందున పరీక్షకు అనుమతించాలని విద్యార్థులు కోరారు. దీంతో సమ్మతించి పరీక్షకు పంపారు.

యూనిఫాం వేసుకు రాకూడదు

పరీక్ష రాసే విద్యార్థులు యూనిఫాం వేసుకు రాకూడదు. పరీక్ష హాల్‌లో విద్యార్థులు ఏ పాఠశాలకు చెందిన వారనేది తెలియకూడదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు దీనిని గమనించాలి.

-ఎం.డేవిడ్‌రాజు, అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్

కళాశాలల్లో అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాళ్లకు కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ సూచించారు. సోమవారం విశ్వవిద్యాలయ అనుబంధ యూజీ, పీజీ, బీఈడీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో వీసీ అవగాహన సదస్సు నిర్వహించారు. అడ్మిషన్ల పెంపు కోసం ఆయా కళాశాలల్లో ఆన్‌లైన్ సెంటర్లు ప్రారంభించాలని సూచించారు. విద్యాసంస్థల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, ఫైర్ సర్టిఫికెట్ విధిగా ఉండాలని సూచించారు. కళాశాలల్లో స్టూడెంట్ క్లబ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయన్నారు. రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రిజిస్ట్రార్ ఎం.ఉష పాల్గొన్నారు.



ఎస్పీ గంగాధరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేయూ వీసీ రాంజీ

మర్యాదపూర్వకంగా..

ఎస్పీ గంగాధరరావును కేయూ వీసీ రాంజీ మర్యాదపూర్వకంగా కలిశారు.

పాఠశాలల్లో ఇఫ్తార్ విందు

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా విద్యార్థులు కలిసిమెలిసి ఉండాలనే లక్ష్యంతో నగరంలో కొన్ని పాఠశాలల్లో సోమవారం ఇఫ్తార్ విందు కార్యక్రమాలు నిర్వహించారు. స్టార్ ప్లస్ స్కూల్‌లో పాఠశాల మెంటార్ శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయ్యప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన కల్వర్టు

● మరమ్మతులు చేయాలని కోరుతున్న రైతులు



శిథిలావస్థకు చేరిన కల్వర్టును చూపుతున్న తుంగలవారిపాలెం రైతులు

అవనిగడ్డ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తుంగలవారిపాలెం దగ్గర నుంచి ప్రారంభమయ్యే డ్రెయిన్‌పై నిర్మించిన కల్వర్టు పూర్తిస్థాయిలో శిథిలమైంది. దాదాపు 60 ఏళ్ల క్రితం నిర్మించిన వీరన్న అలుగు పూర్తిస్థాయిలో ధ్వంసమైంది. తుంగలవారిపాలెం, వేకనూరు, గుడివాకవారిపాలెం, బందలాయి చెరువు, గూడుమోటు గ్రామాల్లో పంట పొలాలు ముంపు బారిన పడే అవకాశం ఉంది. శిథిలావస్థకు చేరిన ఈ కల్వర్టును అభివృద్ధి చేయకపోతే ఈ ప్రాంతంలోని పొలాలన్ని ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ అలుగును అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుని ప్రజలకు ముంపు కష్టాలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్త సులేమాన్‌పై దాడి అమానుషం

బంటుమిల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ కార్యకర్త సులేమాన్‌పై పెడనలో వైసీపీ నాయకులు చేసిన దాడి అమానుషమని టీడీపీ మండల నాయకులు అన్నారు. సులేమాన్‌పై దాడిని వారు ఖండించారు. సోమవారం బంటుమిల్లిలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. హత్యా రాజకీయాల వల్లే వైసీపీ అధికారం కోల్పోయిందని, ఇంకా ఆ పార్టీ నాయకుల్లో మార్పు రాలేదని పార్టీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడుపుతుంటే, వైసీపీ నాయకులు హత్యా, విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నజీర్, బొర్రా కాశీ, రత్నం పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

గూడూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గూడూరు వేంకటాచలస్వామి దేవస్థానానికి చెందిన చేపల చెరువు లీజు వేలం వాయిదా వేసినట్టు ఈవో టీవీవీ మోహనరావు తెలిపారు. పెడన మండలం నేలకొండపల్లి గ్రామంలో దేవాలయానికి చెందిన 8 ఎకరాల 88 సెంట్ల భూమిని చేపల చెరువుగా మార్చి లీజు పొందేందుకు 19న ఉదయం నేలకొండపల్లిలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉందని, అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని ఈవో తెలిపారు.

వివాహం చేసుకుంటానని యువతిని లోబరుచుకున్న వ్యక్తిపై కేసు

● కుటుంబ సభ్యులపైనా కేసు నమోదు

చల్లపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నాను, వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి యువతిని శారీరకంగా వాడుకున్నాక వివాహం చేసుకోనంటూ మోసం చేసిన వ్యక్తిపై చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం..మోపిదేవి మండలం కె.కొత్తపాలేనికి చెందిన మత్తి సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావులు చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఓ దుకాణం నడుపుతున్నారు. పురిటిగడ్డ గ్రామానికి చెందిన మహిళ దుకాణంలో పనిచేస్తుండగా యజమాని కుమారుడు లీలాసతీష్ ఆమెతో పరిచయం పెంచుకుని సన్నిహితంగా ఉండేవాడు. ప్రేమిస్తున్నానని చెప్పి వివాహం చేసుకుంటానని నమ్మబలికి పలుమార్లు శారీరకంగా వాడుకున్నాడు. కొంతకాలంగా లీలాసతీష్ ఆమెతో దూరంగా ఉంటున్నాడు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావని ప్రశ్నిస్తే చేసుకోను దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరించాడు. దీంతో పెద్ద ల సమక్షంలో పెళ్లి గురించి మాట్లాడేందుకు గత నెలలో వారి ఇంటికి వెళ్లగా లీలాసతీష్‌తోపాటు కుటుంబ సభ్యులు దుర్భాషలాడి బెదిరించారు. అక్కడి నుంచి వెళ్లకపోతే చంపేస్తామంటూ దాడికి ప్రయత్నించారని, ఇరుగుపొరుగు సర్ది చెప్పి పెద్దల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది. నాటి నుంచి ఏ సమాధానం చెప్పలేదని, తనను మోసగించిన లీలాసతీష్, బెదిరింపులకు దిగిన కుటుంబ సభ్యులపైన చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదుచేయగా, ఆరుగురిపై ఎస్సై పీఎస్వీ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేయగా, సీఐ కె.ఈశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిని పరిశీలించిన డీఈఈ

మోపిదేవి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మోపిదేవి నుంచి మోపిదేవిలంక, నాగాయితిప్ప వెళ్లే రహదారిని ఆర్ అండ్ బీ డీఈఈ రమేష్ సోమవారం పరిశీలించారు. మోపిదేవి నుంచి మోపిదేవిలంక, నాగాయితిప్ప, చిరువోలులంక, వెంకటాపురం వెళ్లే ఆర్ అండ్ బీ రింగ్ రోడ్డుకు ఇటీవల రూ.55 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. పనుల్లో భాగంగా మోపిదేవి జాతీయ రహదారి నుంచి మోపిదేవిలంక వరకు జేసీబీతో తవ్వకం పనులు చేశారు. అనంతరం అంచనాల్లో లేదంటూ కిలోమీటర్ మేర మరమ్మతులు నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తనకు ఫిర్యాదు ఇచ్చారని, అందుకే పరిశీలనకు వచ్చానని డీఈఈ తెలిపారు. వీలైనంత త్వరగా రహదారిని తవ్వి వదిలేసిన ప్రదేశాల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

టైలరింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పేద మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి ఉచితంగా కుట్టు మిషన్ ఇచ్చేందుకు 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో నగరంలోని సచివాలయాల్లో మహిళలు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆధార్, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను రిజిస్ట్రేషన్ చేసుకునేడప్పుడు అందజేయాలని 45వ డివిజన్ సచివాలయ అడ్మిన్ షేక్ అల్లాభక్షు, డివిజన్ ఇన్‌చార్జి పి.వి.ఫణికుమార్ సూచించారు.

రావెళ్ల ట్రస్ట్ ఆర్థిక సాయం

చల్లపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చల్లపల్లికి చెందిన పేద విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసం కోసం రావెళ్ల ట్రస్ట్ చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మేకావారిపాలెంలోని ఆర్కే కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినికి నగదుసాయం అందించారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరికి చెరొక పదివేలు చొప్పున సాయమందించినట్లు ఉదయ్‌కుమార్ తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షుడు నిడమానూరి దిలీప్‌కుమార్, కృష్ణమోహన్, పరుచూరి సురేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

అవనిగడ్డ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని, వాటిని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. సోమవారం అవనిగడ్డలోని ఎంటీకే టవర్స్ సాహితీ సదనంలో ఎంటీసీఐఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ మాజీ చీఫ్ ఇంజనీర్ మానేపల్లి కోటయ్య-రాధిక దంపతుల ఆధ్వర్యంలో నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ విద్యార్థులకు నిర్వహించిన గణిత, సైన్స్ టాలెంట్ టెస్టుల విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కాలువలకు నూతన షట్టర్లు



అశ్వారావుపాలెంలో షట్టర్లు బిగిస్తున్న కార్మికులు

అవనిగడ్డ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ, నాగాయలంక మండలాల పరిధిలోని పంట కాలువలకు స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నిధులతో పంట కాలువలకు 11 షట్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. సౌత్ చానల్ పరిధిలోని 1, 3, 4, 6, 7 పంటకాలువలు, సెంట్రల్ చానల్ పరిధిలోని 1, 1ఏ, మండపాకల పరిధిలోని 2, 3 నెంబర్ల పంటకాలువలు, బాలస్వామి చానల్ రెగ్యులేటర్‌కు కొత్త షట్టర్ల బిగింపు పనులను సోమవారం అశ్వారావుపాలెం వద్ద నీటి సంఘం అధ్యక్షుడు దాసినేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రేపల్లె వెంకటేశ్వరరావు, ఏఈ పొన్నూరు రవితేజలతో కలిసి డీఈ పి.వెంకటేశ్వరరావు పనులను ప్రారంభించారు.

కరాటే పోటీల్లో బంటుమిల్లి విద్యార్థుల సత్తా

బంటుమిల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం పోలీస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బంటుమిల్లి గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ నాయక్ అండర్-18 విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. జయపురం గ్రామానికి చెందిన బి.శరవన్‌రాజు అండర్-12 విభాగంలో తృతీయ స్థానం, బి.అక్షయ ద్వితీయ స్థానం సాధించారు.